ప్రజాశక్తి

మంగళవారం 16 సెప్టెంబర్ 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

రైల్వేజోన్ దసరా కల్లేనా...



- గెజిట్‌పై ఉలుకూ పలుకూ లేని 'రైల్వే బోర్డు'..
- ఆలస్యంపై అధికారుల్లో ఆందోళన.. ప్రజల్లో అనుమానాలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ మెట్రో రైల్ ప్రాజెక్ట్ దారిలోనే దక్షిణ కోస్తా రైల్వే జోన్ పయనిస్తుందా? అంటే గెజిట్ విడుదలపై కేంద్రం మీనమేషాలు లెక్కిస్తున్న వైనం చూస్తే అదే అనిపించకమానదు. రైల్వే ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై గెజిట్ విడుదలై, ఒడిశా మద్దతు కూడగడితే తప్ప జోన్ పనులు, కార్యకలాపాలపై ఏమీ చెప్పలేమంటూ చేతులెత్తేస్తున్నారు. 2024 జనవరి 8న విశాఖకు విచ్చేసిన ప్రధాని నరేంద్రమోడీ రైల్వే జోన్ అంటూ ప్రకటన చేశారు. ఆ తర్వాత అధికారంలో ఉన్న గత వైసిపి, నేటి కూటమి నేతలూ ఊదరగొడుతూనే ఉన్నా జోన్ కార్యకలాపాలు ఇంతవరకూ ప్రారంభం కాలేదు. విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్ ఈ దసరా కల్లా జోన్ కార్యకలాపాలు ప్రారంభిస్తామంటూ పలుమార్లు మీడియా ముందు వెల్లడించారు. జోన్ పనుల కోసమంటూ గత వైసిపి హయాంలో నగరంలోని ఎల్ఐసి భవన సముదాయంలో ఒక ఆఫీసు తీశారు. కూటమి హయాంలో విఎంఆర్‌డిఎ డెక్ భవన్‌లో రెండంతస్థులను తీసుకున్నట్లు చెబుతున్నారు. గెజిట్ విడుదలైతే తప్ప విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ పనులు మొదలు కావని రైల్వే జనరల్‌మేనేజర్, ఆపరేషన్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఒఎస్‌డి)లు రైల్వే విశ్రాంతి భవనాలకే పరిమితం కావడం తాజా పరిణామం. రైల్వే జోన్ ప్రకటన తర్వాత పార్లమెంట్ సభ్యుల చొరవతో గెజిట్‌ను వెనువెంటనే తీసుకురావాల్సిన బాధ్యత రాష్ట్రంలోని ఎంపీలపై ఉన్నా సరే ఆ కృషి మాత్రం చేయడం లేదన్న విమర్శలను 'కూటమి' నేతలు మూటగట్టుకుంటున్నారు. రైల్వే జోన్‌కు అనేక ఆటంకాలు పెడుతోన్న ఒడిశా సర్కారు తాజాగా కొత్తవలస రైల్వే స్టేషన్ తమవద్దనే ఉండాలంటూ మెలిక పెట్టడం మరో వివాదంగా మారింది.

గెజిట్‌లో ఏముంటుంది?

విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుకు రాజకీయ ప్రకటన 2014లో జరిగినా 2019లో అధికారికంగా కేంద్రం వెల్లడించింది. 2024 జనవరి 8న జోన్‌కు ప్రధాని మోడీ విశాఖలో వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఇప్పటికీ గెజిట్ విడుదల చేయడం లేదు. గెజిట్ వస్తే తప్ప అధికారికంగా పరిధి నిర్ణయం వంటి వాటిని ఆధారం చేసుకుని అధికారులు అడుగు ముందుకేస్తారు. రైల్వే బోర్డు నుంచి ఇంతవరకూ ఉలుకూ పలుకూ లేదు. సౌత్ కోస్ట్ రైల్వే జోన్.. గుంటూరు, గుంతకల్, విజయవాడ డివిజన్లు, వాల్తేరు కలిపి నూతన దక్షిణ కోస్తా రైల్వే జోన్ (విశాఖ కేంద్రం)గా కేంద్రం ఆమోదించింది. కొత్త రైళ్లు కావాలన్నా, రైల్వే లైన్లు వేయాలన్నా, ఉద్యోగావకాశాలు యువతకు పెరగాలన్నా జోన్ పని ప్రారంభం అయ్యాకే అన్నది ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు.

విశాఖ పోర్టు చైర్మన్ అంగముత్తు బదిలీ

- త్వరలో ముంబయి పోర్టులో బాధ్యతలు...
- వైజాగ్ పోర్టు ప్రగతిలో తనదైన ముద్ర



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖపట్నం పోర్టు అథారిటీ (విపిఎ) చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తుకు ఇక్కడ నుంచి బదిలీ చేస్తూ కేంద్ర పోర్టులు, షిప్పింగ్ మంత్రిత్వ శాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. 2023 మేలో అంగముత్తు విశాఖ పోర్టు చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. సుమారు రెండేళ్లు పూర్తవుతోంది. సాధారణంగా 3ఏళ్లయినా పోర్టు చైర్మన్ ఇక్కడ బాధ్యతలు నిర్వహించే ఆనవాయితీ ఉంది. ముంబయి పోర్టు అథారిటీ (ఎంపిఎ) చైర్మన్‌గా త్వరలో అంగముత్తు బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలుస్తోంది. మరో వారం రోజుల పాటు విశాఖ పోర్టులోనే వివిధ కార్యకలాపాల నిర్వహణ రీత్యా ఉండనున్నారు. ఈనెల 17వ తేదీన పోర్టు ట్రస్ట్ బోర్డు మీటింగ్, ఈనెల 19న నోవోటల్‌లో దేశంలోని పోర్టుల ఆధ్వర్యాన 'రోడ్ షో' కార్యక్రమాలు జరుగనున్నాయి. ఆ తర్వాత ముంబయి పోర్టుకు వెళతారని పోర్టు వర్గాల్లో చర్చ నడుస్తోంది.

పోర్టు సుస్థిర ఆర్థిక ప్రగతిలో తనదైన ముద్ర...

విశాఖ పోర్టు అథారిటీ (విపిఎ) బాధ్యతల్లోకొచ్చిన అనతి కాలంలోనే డాక్టర్ అంగముత్తు పోర్టు ప్రగతి విషయంలో చురుకుగా వ్యవహరించారన్న పాపులారిటీ సాధించారు. పోర్టు పరిసరాలు, అంతర్గత కార్యాలయాల నిర్వహణ, నగర పరిధిలోని పోర్టు పరిసరాల్లో మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. పర్యావరణ పరిరక్షణతో కూడిన సుస్థిర ప్రగతి, కార్గో హేండ్లింగ్ లక్ష్యాలను సాధించడంలో అంగముత్తు తనదైన ముద్ర వేసుకున్నారు. పోర్టు ఏరియాలోనే అంతర్గత ఫ్లై ఓవర్ల నిర్మాణానికి కృషిచేశారు. ఆయిల్ టర్మినల్, అవుటర్ హార్బర్‌లో ఫైర్ ఫైటింగ్ సౌకర్యాలను ఆధునీకరించారు. గ్రీన్ బెల్ట్ ప్రాజెక్టులను పోర్టు ఏరియా అంతటా విస్తరించారు. పోర్టు అథారిటీ దేశీయ మారిటైం అభివృద్ధిలో వ్యూహాత్మక పాత్రను పోషించేలాగ కార్గో హేండ్లింగ్ లక్ష్యాలను సాధించేందుకు ప్రత్యేక కృషి చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 82.62 మిలియన్ టన్నుల కార్గోను సాధించడం రికార్డు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ 90 మిలియన్ టన్నుల లక్ష్యం దిశగా

మిగతా 2లో..

తక్షణమే వేతనాలు చెల్లించాలి

కంచాలు మోగించి ఉక్కు కార్మికుల నిరసన

▶ వార్త మెయిన్ 3లో..

నలుగురు ఇన్‌స్పెక్టర్లు బదిలీ

ఇద్దరు విశాఖ రేంజ్‌కు సరెండర్

▶ వార్త 2లో..

బల్క్‌డ్రగ్ పార్కు పనులు నిలిపేయాలి

ఉరితాళ్లతో వినూత్న నిరసన

▶ వార్త 7లో..



ఆర్‌పిల ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న మణి

ఆర్‌పిలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఆర్‌పిలకు మూడు నెలలుగా బకాయి ఉన్న వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఎపి మెప్మా ఆర్‌పి ఉద్యోగుల సంఘం (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షులు పి.మణి డిమాండ్‌చేశారు. ఈ మేరకు జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సోమవారం పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆర్‌పిలపై విపరీతమైన పనిభారాన్ని రుద్దుతున్నారని, ఉద్యోగ భద్రతకు తీవ్ర విఘాతం కలిగించే సర్క్యులర్ 1238 తీసుకొచ్చారని, దీనిని రద్దు చేయాలని, పని భారం తగ్గించాలని, లాగిన్ ఆసిన వారికి తక్షణం లాగిన్ ఇవ్వాలని డిమాండ్‌చేశారు. వ్యక్తిగత కక్షతో ఆర్‌పిలను రాజకీయంగా వేధిస్తున్న 22వ వార్డు జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్‌పై ఆ పార్టీ

మిగతా 2లో..

స్విగ్గీ, జొమాటో రైడర్స్ బంద్ జయప్రదం చేయండి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : స్విగ్గీ, జొమాటో రైడర్స్ ప్రతి శని, ఆదివారాలు చేపట్టే బందును జయప్రదం చేయాలని అఖిలభారత గిగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు బి.జగన్ పిలుపునిచ్చారు. జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో గిగ్ వర్కర్స్ యూనియన్ మహాసభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ, జొమాటో, స్విగ్గీ రైడర్లు ప్రతి శని, ఆదివారం సమ్మె చేయాలని పిలుపునిచ్చారు. జొమాటో యాజమాన్యంతో జరిగిన చర్చల వివరాలు తెలిపారు. స్విగ్గీ యాజమాన్యం స్పందించలేదని తెలిపారు. సుదీర్ఘ చర్చల అనంతరం మహాసభ ఏకగ్రీవంగా పలు తీర్మానాలను ఆమోదించింది. స్విగ్గీ మేనేజ్‌మెంట్ చర్చలకు వస్తుందో లేదో వేచి చూడాలని, జొమాటో యాజమాన్యం ఇచ్చిన హామీలను బుధవారం నాటికి అమలు చేస్తుందో లేదో గమనించాలని, జొమాటో హామీ నిలబెట్టుకుంటే, యూనియన్ వచ్చే శనివారం, ఆదివారం స్విగ్గీనే బహిష్కరిస్తుందని తీర్మానించారు. జొమాటో హామీని నిలబెట్టుకోకపోతే, జొమాటో, స్విగ్గీ రెండింటిపైనా సమ్మె కొనసాగుతుందన్నారు. సభలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి. కుమార్, యూనియన్ గౌరవాధ్యక్షులు కెఎం.కుమారమంగళం పాల్గొన్నారు.

అద్దె బస్ డ్రైవర్ల జీతాలు పెంచాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వాల్తేర్ డిపో హైర్ బస్ డ్రైవర్ల జీతాలు పెంచాలని హైర్ బస్ డ్రైవర్ల యూనియన్ వాల్తేర్ డిపో గౌరవాధ్యక్షులు, సిఐటియు జిల్లా కార్యదర్శి పి.వెంకటరావు డిమాండ్ చేశారు. ఎపిఎస్ ఆర్‌టిసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ వాల్తేరు డిపో కమిటీ (సిఐటియు) ఆధ్వర్యంలో డిపో ఎదుట సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ, హైర్ బస్ డ్రైవర్లకు జీతాలు అగ్రిమెంట్ పూర్తి అయి 11 నెలలకు కావస్తోందని, ఇప్పటివరకు యజమానులు జీతాలు పెంచకపోవడం అన్యాయమన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రతి నెలా 5వ తేదీన జీతాలు చెల్లించాలని, పిఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, నైట్ అవుట్ అలవెన్సులు ఇవ్వాలని, వారాంతపు సెలవులు, లేబర్ హాలిడేస్, లేబర్ చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీతాలు పెంపుదలతో పాటు ఇతర డిమాండ్లు సాధన కోసం ఈ నెల 29వ తేదీన అద్దె బస్సు డ్రైవర్లు సమ్మెలోకి వెళ్లాలని నిర్ణయించారని తెలిపారు. ఈ ధర్నాలో హైర్‌బస్ వాల్తేర్ డిపో అధ్యక్ష కార్యదర్శులు బి.జంపన్న, పి.రఘు, జిల్లా కార్యదర్శి వి.అర్జున్, అద్దె బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.

పిజిఆర్‌ఎస్‌కు వినతులు

ప్రజాశక్తి-యంత్రాంగం

విశాఖ కలెక్టరేట్ : జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించి 329 వినతులు అందాయి. జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్ భవానీ శంకర్, ప్రత్యేక ఉప కలెక్టర్ శేషశైలజ, జివిఎంసి సిటీ ప్లానర్ ధనుంజయరావు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

అర్హత కలిగిన వికలాంగులకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ వికలాంగుల హక్కుల పోరాట సమితి (విహెచ్ పిఎస్) ఆధ్వర్యాన కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డిఆర్‌ఒకు వినతి పత్రం సమర్పించారు. మురికి వాడల (స్లమ్స్) భూములను భూకబ్జాదారులు ఆక్రమించుకునేందుకు సహకరిస్తున్న జివిఎంసి రెవెన్యూ అధికారులను సస్పెండ్ చేసి, విచారించి, శిక్షించాలని డిమాండ్ చేస్తూ మురికివాడల నివాసుల సంక్షేమ సంఘం, పిఒడబ్ల్యు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం సమర్పించారు.

జివిఎంసికి 111 వినతులు

ఎంవిపి.కాలనీ : జివిఎంసిలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో అన్ని విభాగాలకు కలిపి 111 వినతులు వచ్చాయని మేయర్ పీలా శ్రీనివాసరావు తెలిపారు.

నేడు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ రాక

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: విశాఖ నగరంలో బుధవారం జరగనున్న వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం విశాఖ రానున్నారు. మంగళవారం సాయంత్రం 6.25 గంటలకు ఢిల్లీలో బయలుదేరి 7.45 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుండి రోడ్ మార్గంలో 8.30 గంటలకు రుషికొండ సమీపంలో రాడిసన్ బ్లూ హోటల్‌కు చేరుకుని బస చేస్తారు. బుధవారం ఉదయం 10 గంటల నుండి 11.30 వరకు వైజాగ్ కన్వెన్షన్ సెంటర్‌లో జరగనున్న నెక్స్ట్ జెన్ జిఎస్‌టి రిఫామ్స్ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం 12 గంటల నుండి అదే ప్రాంగణంలో ప్రధాన మంత్రి వర్చువల్‌గా పాల్గొనే 'స్వస్థ్ నారి శక్తి పరివార్ అభియాన్' కార్యక్రమంలో పాల్గొంటారు. భోజన విరామం అనంతరం మధ్యాహ్నం 3 గంటల నుండి 4.15 వరకూ రాడిసన్ బ్లూ హోటల్ లో జరగనున్న 'జిసిసి బిజినెస్ సమ్మిట్'లో పాల్గొంటారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు హోటల్ నుండి బయలుదేరి 5.45కు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుని 6.15 గంటలకు బయలుదేరి ఢిల్లీ వెళతారు.

నలుగురు ఇన్‌స్పెక్టర్లు బదిలీ

ఇద్దరు విశాఖ రేంజ్‌కు సరెండర్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: విశాఖపట్నం పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఆరుగురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎంవిపి లా అండ్ ఆర్డర్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న జె.మురళి, వెస్ట్‌జోన్ క్రైమ్ విభాగంలో పనిచేస్తున్న ఎన్.శ్రీనివాసరావును విశాఖపట్నం రేంజ్‌కు సరెండర్ చేశారు. ద్వారకా ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న కెఎన్‌ఎస్‌వి.ప్రసాద్‌ను ఎంవిపి లా అండ్ ఆర్డర్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేయగా, పోలీస్ కంట్రోల్‌రూమ్‌లో విధులు నిర్వహిస్తున్న ఎన్వీ.ప్రభాకరరావును ద్వారకా ట్రాఫిక్ సర్కిల్‌కు, విశాఖపట్నం సిటీ విఆర్ రేంజ్ - 2లో విధులు నిర్వహిస్తున్న మీసాల చంద్రమౌళిని వెస్ట్‌జోన్‌క్రైమ్ విభాగానికి, విశాఖపట్నం సిటీవిఆర్-1 విధులు నిర్వహిస్తున్న బి.భాస్కరరావును పోలీస్ కంట్రోల్‌రూమ్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వస్తాయని, విశాఖపట్నం రేంజ్‌కు సరెండర్ చేసిన ఇన్‌స్పెక్టర్లను వెంటనే విశాఖపట్నం రేంజ్ డిఐజికి రిపోర్ట్ చేయాలని, ఇతర స్టేషనులకు బదిలీ అయిన ఇన్‌స్పెక్టర్లు వెంటనే ఆయా ప్రాంతాల ఎడిసిపిలకు రిపోర్ట్ చేయాలని ఆయన ఆదేశించారు.

హెడ్ కానిస్టేబుల్ బదిలీ

ఎంవిపి లా అండ్‌ఆర్డర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ ఎం.శుభకర్‌రావును పద్మనాభం లా అండ్‌ఆర్డర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

మొదటి పేజీ తరువాయి..

విశాఖ పోర్టు చైర్మన్ అంగముత్తు బదిలీ

పోర్టు ప్రయాణం చేస్తోంది. ఇంటర్నల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎన్విరాన్‌మెంటల్ పెంచేందుకు కృషి, బిజినెస్ ప్రాజెక్టులు, పోర్టు ఆపరేషన్స్‌ను పెంచేందుకు వివిధ కార్యకలాపాలను ఈ కాలంలో చేపట్టారు. ఫ్లై ఓవర్లు, కన్వర్టింగ్ బ్రిడ్జిల నిర్మాణం, బెర్త్‌ల ఆధునీకరణ చేయడంతో సరకు రవాణాలో కీలక స్థానాలను విశాఖ పోర్టు చేజిక్కించుకుంది.

పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణ వ్యవహారం...

అంగముత్తు హయాంలోనే పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రిని పిపిపికి ఇవ్వాలన్న నిర్ణయంపై పోర్టు ఉద్యోగులు, రిటైర్డ్ పెన్షనర్ల ఉద్యమం ఊపందుకుంది. నగరంలోని శాలిగ్రాంపురం హైవే పక్కనే 1984లో 150 పడకల సామర్థ్యంతో దీన్ని నిర్మించారు. రూ.250 కోట్లతో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం పేర ప్రైవేట్ ఆపరేటర్లకు ఇవ్వడాన్ని పోర్టు అండ్ డాక్ అధికారులు, కార్గో హేండ్లింగ్ డివిజన్ కార్మికులు, ఉద్యోగులు, కార్మికులంతా వ్యతిరేకించారు. నెలల తరబడి ఆందోళన బాట ఆసుపత్రి ఎదుటే నిర్వహిస్తూ వస్తున్నారు. సుమారు 35వేల మంది వైద్యసదుపాయాన్ని కోల్పోయే ప్రమాదం ఉండడంతో పలుమార్లు సిఐటియు ఆధ్వర్యాన చైర్మన్ నివేదించిన నేపథ్యంలో ఈ అంశంపై పలుమార్లు బోర్డు మీటింగుల్లో పిపిపి నిర్ణయంపై పున:పరిశీలన చేయడంలో అంగముత్తు తనదైన శైలిలో వ్యవహరించారు. కార్మికులు, యూనియన్లు ఆయనకు వివరించడంతో సానుకూలంగా స్పందించేవారు. ఫలితంగా ఇన్నాళ్లూ ఇది పిపిపిలోకి వెళ్లకుండా ఆగిందన్నది స్పష్టమవుతోంది. పోర్టు కళావాణి లీజు వ్యవహారంలోనూ నిశితంగానే అంగముత్తు వ్యవహరించారన్నది తెలుస్తోంది. పోర్టు నుంచి లీజుకు తీసుకుని వ్యాపారమే పరమావధిగా మార్చే విషయంపై లీజుదారులకు నోటీసులు కూడా తాజాగా ఇచ్చారు. విశాఖ పోర్టులో నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించిన నేపథ్యంలో తానే స్వయంగా బదిలీ కోరుకున్నారన్న చర్చ తాజాగా పోర్టు సిబ్బందిలో వినిపిస్తోంది. అంతేగాక పోర్టు నుంచి వ్యాపార లావాదేవీలు (రోడ్డు రవాణా) సాఫీగా ట్రాఫిక్ అంతరాయం లేకుండా సాగేందుకు రూ.కోట్ల పోర్టు నిధులతో 8లైన్ల రహదారులను వేయాలన్న ఒత్తిడి కూడా నగరానికి చెందిన పలువురు బడా వ్యాపారుల నుంచి పోర్టు చైర్మన్‌పై ఉన్నట్లు వినిపిస్తోంది.

ఆర్‌పిలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

రాష్ట్ర అధ్యక్షులు పవన్ కల్యాణ్ తక్షణం చర్యలు చేపట్టాలని కోరారు. అతని వేధింపుల వల్ల తొలగించిన ఐదుగురు ఆర్‌పిలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ అన్యాయాన్ని ప్రశ్నించారన్న కక్షతో యూనియన్ ప్రధాన కార్యదర్శి రూన్సీ, కోశాధికారి సత్య వరలక్ష్మిలను విధుల నుండి తొలగించాలని, పీడీ, ఎపిడిపై మూర్తియాదవ్ తీవ్ర ఒత్తిడి తెస్తున్నారని, దీన్ని పవన్ కల్యాణ్ ఆపించాలని కోరారు. మూర్తి యాదవ్ ను కట్టడి చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాల్లో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.లక్ష్మి, రూన్సీ, కోశాధికారి సత్య వరలక్ష్మి, ముఖ్య నాయకులు సుధ, వందన, ధనలక్ష్మి, లక్ష్మి, దేవి, నూకరత్నం, జయ, మల్లీశ్వరి, లత, చంద్రకళ, త్రివేణి, రామలక్ష్మి, గాయత్రి, హిమబిందు, విశాలాక్షి పాల్గొన్నారు.

సాయికృష్ణపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి పరిధిలోని రెల్లి వీధి వార్డ్ బాయ్స్ కాలనీలో సాయికృష్ణ పూర్తిగా నగ్నంగా ఉండి దళిత మహిళ సత్యవతి ఎదుట నిలుచొని బూతులు తిట్టిన చర్యపై వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసి 17 రోజులు గడిచినప్పటికీ ఇంతవరకు అతనిపై చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు పేర్కొన్నారు. సాయికృష్ణపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఎల్‌ఐసి సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వన్ టౌన్ సిఐ గూండాలకు మద్దతు ఇస్తూ పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సాయికృష్ణపై చర్యలు తీసుకోకుండా ఫిర్యాదు ఇచ్చిన దళిత మహిళ సత్యవతినే, ఆమె భర్తను 17 రోజులుగా స్టేషన్ చుట్టూ తిప్పుతూ, వేధింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. సాయికృష్ణ బహిరంగంగా తిరుగుతున్నట్లు వీడియోలతో సహా సాక్ష్యాలు ఉన్నప్పటికీ, అతని కోసం వెతుకుతున్నామని, దొరకడం లేదని చెబుతూ పోలీసులు కాలయాపన చేస్తున్నారని మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.చంద్రశేఖర్ ఆరోపించారు. ఈ వ్యవహారంపై నగర పోలీస్ కమిషనర్ కల్పించుకొని తగు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె.గణేష్, ఎర్రి బాబు, వంశీకృష్ణ, నిర్మల, మౌళి, ఎం.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

డాగ్ కెన్నల్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : విశాఖపట్నం నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో జివిఎంసి నిధులతో నిర్మించిన డాగ్ కెన్నల్‌ను సోమవారం మేయర్ పీలా శ్రీనివాసరావు, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ప్రారంభించారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పాత వాటికి అదనంగా మరో ఏడు శునకాలను విశాఖకు తీసుకురావడం జరిగిందని, రాష్ట్రంలో మరెక్కడా లేనివిధంగా పది ప్రత్యేక నార్కోటిక్ తనిఖీల్లో శిక్షణ పొందిన డాగ్స్ మన వద్ద ఉన్నాయని ఇవి గంజాయి నిర్మూలనకు తోడ్పడుతాయని తెలిపారు. డ్రగ్స్ తర్ఫీదులో ప్రథమ బహుమతి పొందిన లైకా విశాఖపట్నం రావడం గర్వకారణం అని మేయర్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందిస్తున్నా మని ఆయన తెలిపారు.

రజకులకు సామాజిక రక్షణ చట్టం చేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రజకులకు సామాజిక రక్షణ చట్టం చేయాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం విశాఖ జిల్లా అధ్యక్షులు పట్నాల వెంకటరమణ, కార్యదర్శి మల్లేశ్వరపు ఈశ్వరరావు డిమాండ్ చేశారు. రజకుల సమస్యలను పరిష్కరించాలని సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 50 సంవత్సరాలు నిండిన రజకులకు పింఛన్, 250 యూనిట్లు ఉచిత కరెంటు, ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలని, రజకపేటలలో కమ్యూనిటీ హాల్స్ నిర్మించాలని డిమాండ్‌చేశారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా రజక సంక్షేమ సమావేశాలు నిర్వహించాలని కోరారు.

జెపి.నడ్డా దిష్టి బొమ్మ దహనం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం వచ్చిన కేంద్రంలోని బిజెపి మంత్రి జెపి.నడ్డా స్టీల్‌ప్లాంట్‌పై కనీసం ప్రస్తావించక పోవడాన్ని ఖండిస్తూ సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్, ఎన్ఎఫ్ఐడబ్ల్యు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. జెపి.నడ్డా దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు వై.రాంబాబు, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షులు కె.వనజాక్షి మాట్లాడుతూ, రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు పివిఎన్.మాధవ్ పదవీ వ్యామోహంతో, రాజకీయ భిక్ష పెట్టిన విశాఖ ప్రాంతానికి అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. నరేంద్ర మోడీ రాష్ట్ర ప్రజల గుండెల్లో కాదు భావితరాల ప్రజల ఆకాంక్షలను నాశనం చేశారన్నారు.

విశ్వేశ్వరయ్యకు ఘన నివాళి



విశ్వేశ్వరయ్యకు నివాళులర్పిస్తున్న గీతం ప్రతినిధులు

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విశ్వేశ్వరాయ భవన్‌లో ఇంజినీర్స్‌డేలో మోక్షగుండం విగ్రహానికి వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎరోల్ డిసౌజా, గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్, కంప్యూటర్ ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ ఎస్. అరుణ్‌కుమార్, సివిల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి ప్రొఫెసర్ ముకుంద్, సీనియర్ ప్రొఫెసర్లు, పరిశోధకులు, విద్యార్థులు పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

పెందుర్తి : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి ప్రిన్సిపల్ చంద్రశేఖర్ పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మేనేజర్ ఎస్‌విఉఎన్ రాజు, లెక్చరర్స్, సిబ్బంది పాల్గొన్నారు

వేపగుంట :నరవ విశాఖ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి, ఇంజినీర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఎపిఇపిడిసిఎల్ ఆపరేషనల్ డైరెక్టర్ టివి.సూర్యప్రకాశ రావు, బిఐటిసి, ఎపి టూరిజం డైరెక్టర్ జి.ఉమామహేశ్వం రావు పాల్గొని మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటం వద్ద జ్యోతిప్రజ్వళన చేసి, పూలమాలలతో నివాళులర్పించారు.

పలుచోట్ల ఇంజినీర్స్‌డే

కళాశాల చైర్మన్ జి.సత్యనారాయణ, కళాశాల డైరెక్టరు బి. భాస్కరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జివి ప్రదీప్‌వర్మ, పాలిటెక్నికల్ కాలేజీ ప్రిన్సిపాల్ పి..ప్రసాదు సివిల్ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్.కన్నమనాయుడు, డీన్ అకడమిక్ డి.శాంతారావు, ఒఎస్‌డి గాయత్రిరామ్ ఉన్నారు.

తగరపువలస : స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీర్స్ డే నిర్వహించారు. విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ ఆర్‌విఎస్ సుబ్రమణ్యం, ప్రిన్సిపల్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ ఎ చంద్రశేఖర్, విజయనగరం ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ ఎం శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు

అనకాపల్లి : సాంకేతికతను స్థిరత్వంతో మిళితం చేస్తే ఇంజనీర్లదే భవిష్యత్తు అని జేఎన్టీయూ జీవీ రిజిస్ట్రార్ డాక్టర్ జి. జయసుమ అన్నారు. స్థానిక డైట్ కళాశాలలో ఇంజనీర్స్ డే నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, విభాగాధిపతి డాక్టర్ వి. భార్గవి, పాల్గొన్నారు.

కోటవురట్ల : మాకవరపాలెం అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రసాదరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఎ.సుబ్రహ్మణ్యేశ్వర రావు, సికిందర్ బాషా, యువరాజ్ హాజరై విశ్వేశ్వరయ్య దేశానికి చేసిన సేవలను కొనియాడారు. సాంకేతిక నైపుణ్యం కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

ఎంవిపి.కాలనీ : జివిఎంసి ప్రధాన కార్యాలయంలో ఇంజినీర్లను మేయర్ పీలా శ్రీనివాసరావు సన్మానించారు. ఇంజినీర్లు దేశ ప్రగతికి పునాదులని కొనియాడారు. సీతమ్మధారలోని విశాఖపట్నం ప్రజారోగ్య సాంకేతిక శాఖ కార్యాలయంలో ఇంజనీర్స్ డేను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.కామేశ్వర రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దక్షిణామూర్తి పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎస్ఇ కామేశ్వరరావు

సీతమ్మధార : ఎపిఇపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి, ఇంజనీర్స్ డే వేడుకలను నిర్వహించారు. విశ్వేశ్వరయ్య చిత్రపటానికి చీఫ్ జనరల్ మేనేజర్లు వి.విజయలలిత, డి.సుమన్ కళ్యాణి, బి.అశోక్ కుమార్, ఎస్.రాజాబాబు, బి.శ్రీదేవి. సిబ్బంది పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎపి హౌసింగ్ పోలీస్ కార్పొరేషన్ ఇఇ సురేష్‌బాబు ఆధ్వర్యంలో సంస్థ కార్యాలయంలో ఇంజనీరింగ్ డే ఘనంగా నిర్వహించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు నివాళులర్పించారు.

నేరాలు ఘోరాలు

మృతదేహాలు లభ్యం

ప్రజాశక్తి-మధురవాడ : రుషికొండ బీచ్‌లో ఆదివారం గల్లంతైన ఇద్దరు వ్యక్తుల మృతదేహాలు ఆదివారం ఒడ్డుకు చేరాయి. దీనిపై పిఎం పాలెం సిఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాలివి..పీఎంపాలెం పరిసర ప్రాంతాలకు చెందిన నలుగురు స్నేహితులు ఆదివారం ఇంట్లో సినిమాకు వెళ్తున్నామని. చెప్పి సాయంత్రం 5 గంటల సమయంలో రుషికొండ బీచ్ కు వెళ్లారు. రుషికొండ బీచ్‌లో సముద్ర స్నానానికి దిగగా, అప్పటికే సమయం మించిపోయింది, వెళ్లిపోవాలని పోలీసులు సూచించడంతో అక్కడి నుంచి దూరంగా వెళ్లి సాయి ప్రియా రిసార్టు వెనుక ప్రమాదకర తీరంలో స్నానానికి దిగి సరదాగా ఈత కొడుతుండగా, అలల ఉధృతికి కొట్టుకుపోయారు. గల్లంతైన ఇద్దరిని రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. పీఎంపాలెం అశోక్ నగర్‌కు సంజయ్ (15), తులసీనగర్ కాలనీకి చెందిన మామిడిశెట్టి శ్యాంసాయి (15) మృతదేహాలు ఒడ్డుకు చేరగా, వాటిని కెజిహెచ్ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సారా బట్టీలపై దాడులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం రూరల్ పరిధిలో సోమవారం రూరల్ సీఐ రేవతమ్మ, రూరల్ ఎస్సై రాజారావు సారా బట్టీలపై దాడులు చేశారు. సిఐ రేవతమ్మ మీడియాతో వెల్లడించిన వివరాల ప్రకారం... డిఎస్పీ శ్రీనివాసరావు సూచన ప్రకారం కోటవుట్ల, నర్సీపట్నం రూరల్ పోలీస్ స్టేషన్ల సరిహద్దులోని బంగారయ్యపాలెం, బాపిరెడ్డి కొత్తపాలెం గ్రామాలలో దాడులు నిర్వహించామని తెలిపారు. ఈ దాడిలో 3,500 లీటర్ల పులుపు, పాత్రలను ధ్వంసం చేశామన్నారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి- ఆనందపురం :మండలంలోని కుసురువాడ పంచాయతీ శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారంతో పోలీసులు దాడి చేశారు. సీఐ వాసునాయుడు ఆదేశాలతో ఎస్ఐ సంతోష్ నేతృత్వంలో పోలీసులు దాడి చేసి ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2,003 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

ల్యాండ్ పూలింగ్‌పై గ్రామసభ

ప్రజాశక్తి - ఆనందపురం : మండలంలోని శొంఠ్యాంలో భీమిలి ఆర్‌డిఒ సంగీత్‌మాధుర్ ఆదేశాలతో సోమావరం తహశీల్దార్ ఎన్.శ్రీనుబాబు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. సర్వేనెంబర్ 347లో 72 ఎకరాల ల్యాండ్ పూలింగ్‌కు అవసరమైన ప్రజాభిప్రాయసేకరణకు రైతులతో గ్రామసభ నిర్వహించారు. వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ల్యాండ్ పూలింగ్‌కు, రైతులందరూ సహకరించాలని కోరారు. కాగా ల్యాండ్ పూలింగ్‌కు గుర్తించిన భూములో రైతులు జీడి మామిడి సాగు చేసి, ఫల సాయంతో జీవనోపాధి పొందుతున్నారు. కార్యక్రమంలోవిఆర్‌ఒ దేవరాజ్, నాయకులు లెంక రాంబాబు పాల్గొన్నారు.

తొలగించిన కార్మికుల్ని విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : తొలగించిన కాంట్రాక్ట్ కార్మికుల్ని విధుల్లోకి తీసుకోవాలనిస్టీల్ ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మిక సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు, వేరే రాష్ట్రాల వారిని చేర్చుకోవడంపై సేఫ్టీ ఆఫీసు వద్ద ఐదు రోజులుగా ఉక్కు నిర్వాసితుల కాంటాక్ట్ లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతూ, కొత్తగా విధుల్లో చేరేందుకు వచ్చిన వారిని అడ్డుకున్నారు. నైపుణ్యం ఉన్న కార్మికులను తొలగించి ఇతర రాష్ట్రాల కార్మికులతో సేఫ్టీలు చేస్తున్న ఉక్కు యాజమాన్యం మొండి వైఖరి విడనాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ, డిపి భాస్కరరావు, ఉమ్మిడి అప్పారావు, మంత్రి రవి, వంశీకృష్ణ, కోన రమణ పాల్గొన్నారు. కాంట్రాక్టు కార్మికుల ఆందోళనకు డి ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్ సంఘీభావం తెలిపారు.



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

మురుగు సమస్యపై వినతి

ప్రజాశక్తి -పద్మనాభం.: మండలంలోని అనంతవరం గ్రామపంచాయతీ గొల్లలపాలెం గ్రామంలో డ్రైనేజీ, మురుగునీటి సమస్యలపై స్థానికులు ఎంపిడిఒ విజయకుమార్, డిప్యూటీ తహశీల్దార్ చంద్రశేఖర్‌లను కలిసి విన్నవించారు. ఇంట్లోని వాడిక నీరు ఇంటి ముంగిట్లో నిల్వ ఉండడంతోపాటు పక్కింటి జాగాల్లోకి వెళ్లడంతో దాదాపు 15ఏళ్లుగా గ్రామంలో తరచూ వివాదాలు జరుగుతున్నాయని, ఈ బెడద భరించలేక పది కుటుంబాలు గ్రామం నుంచి వలస పోయాయన్నారు. దీనిపై గ్రామపంచాయతీకి విన్నవించినా ఎటువంటి స్పందన లేదన్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో బి సాయి, కె కేశవ, ఎ.పేరినాయుడు, బి రాము.ఉన్నారు.

విమ్స్‌లో మహిళలకు ఉచిత వైద్యం

రేపటి నుంచి స్వస్త్ నారీ శక్తి పరివార్ అభియాన్ పక్షోత్సవాలు



హెల్ప్ డెస్క్ప్రారంభిస్తున్న విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు

ప్రజాశక్తి- ఆరిలోవ : కేంద్ర ప్రభుత్వ స్వస్త్ నారీ శక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా విమ్స్‌లో ఈనెల 17, బుధవారం నుంచి వచ్చేనెల 2 వరకు 15 రోజులపాటు మహిళలకు ఉచిత వైద్యసేవలు అందించనున్నట్లు విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. సోమవారం ఆసుపత్రిలో సంబంధిత హెల్ప్ డెస్క్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు నిర్వహించే కార్యక్రమంలో భాగంగా మహిళలకు కేన్సర్ స్క్రీనింగ్, సుగర్, బిసి, ఊపిరితిత్తులు, ఒబెసిటీ, ఇఎన్‌టి, ఇతర సమస్యలకు ఉచిత వ్యాధినిర్ధారణ పరీక్షలు, వైద్యసేవలు అందిస్తామన్నారు. అవసరమైన రక్తపరీక్షలతో పాటు, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షలు ఉచితంగా చేస్తామని, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే అవయవదానం, రక్తదానం, ఉచిత వ్యాక్సినేషన్‌పై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌కుమార్, ఆర్‌ఎంవో డాక్టర్ శిరీష, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు..

ఘనంగా సన్యాసిరావు జన్మదిన వేడుకలు



సన్యాసిరావుకు శుభాకాంక్షలు చెబుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ఆరిలోవ : టిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ, యాదవ సంఘం విశాఖ జిల్లా అధ్యక్షులు, ఒమ్మి సన్యాసిరావు జన్మదిన వేడుకలు సోమవారం తోటగరువు టిడిపి పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. నియోజకవర్గ టిడిపి శ్రేణుల సమక్షంలో కేకు కట్ చేశారు. పెదగదిలి వినాయకుడి గుడి పార్కులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు గాడి సత్యం, పార్లమెంటు పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీలు ఒమ్మి పోలారావు, ఏడువాక సన్యాసిరావు, బుడుమూరు గోవిందు, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ రేఖా జ్యోతి, ముగడ రాజారావు, దువ్వి తాతారావు, దువ్వి సంతోష్ పాల్గొన్నారు.

వార్డులో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 12వ వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి రామన్ కోరారు. సోమవారం జివింఎసి కమిషనర్ కేతన్‌గార్గ్, నగర మేయర్ పీలా శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు వార్డులో వీధి దీపాలు, తాగునీరు, వీధి కుక్కల బెడద, పారిశుధ్య సమస్యలను విన్నవించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని విజయరాంపురం గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. సోమవారం పొట్నూరు యూనిట్ పరిధిలోని రైతులకు ఆరుతడి విధానంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో వరిసాగుపై వివరించారు.

యోగా న్యాయనిర్ణేతగా శ్రీను

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని గుడిలోవ విజ్ఞాన విహార్ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు జె. శ్రీను జాతీయస్థాయి యోగా న్యాయ నిర్ణేతల పరీక్షల్లో అర్హత సాధించారు. యోగ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హరియాణాలో నిర్వహించిన ఆన్‌లైన్ గ్రేడ్-3 పరీక్షలో ప్రతిభ చూపారు. శ్రీనును ఎపి యోగ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సిహెచ్‌వి. నరసింహస్వామి రాజు, జనరల్ సెక్రటరీ ఎం. అవినాష్ శెట్టి, పాఠశాల డైరెక్టర్ దూసి రామకృష్ణ అభినందించారు.

ఒకటో వార్డులో జెడ్‌సి పర్యటన

ప్రజాశక్తి తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు కొత్తపేట, జ్యూట్ కార్మికవాడ తది తర ప్రాంతాల్లో జెడ్‌సి ఒమ్మి అయ్యప్పనాయుడు సోమవారం పర్యటించారు. కొత్తపేటలో పిచ్చిమొక్కలు ఏపుగా ఉండడం, చెత్తా చెదారం పోగులుగా ఉండడాన్ని గమనించారు. సామాజిక మరుగుదొడ్ల సమస్యను స్థానిక మహిళలు విన్నవించగా, తగు చర్యలు చేపట్టాలని శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, సచివాలయం శానిటరీ సెక్రటరీ హిమబిందులను ఆదేశించారు. కాగా జోనల్ కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్‌ఎస్‌లో 12 అర్జీలు స్వీకరించినట్లు జెడ్‌సి అయ్యప్పనాయుడు తెలిపారు.

స్టాఫర్లు తొలగించాలని వినతి

ప్రజాశక్తి తగరపువలస : స్థానిక గణేష్ థియేటర్ యాజమాన్యం ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించేలా ఇష్టారీతిన ఏర్పాటు చేసిన స్టాఫర్లు, బారికేడ్లు తొలగించాలని స్థానిక వ్యాపారులు కోరారు. సోమవారం టిడిపి నేతలు పిట్టా సురేష్, సుబ్బారావు, జనసేన నాయకులు సతీశ్‌తో కలిసి జెడ్‌సి అయ్యప్పనాయుడును కలిసి వినతి పత్రం అందజేశారు. థియేటర్ ప్రహరీ వెలుపల రోడ్డుపైనే ముందుకొచ్చి ఏర్పాటు చేసిన స్టాపర్లుతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.దీనిపై జెడ్‌సి స్పందిస్తూ, పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక వ్యాపారులు కొల్లా మహేష్, ఆనంద్, శ్రీను మాస్టారు, మూర్తిఉన్నారు

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పల్లా, పక్కనే అసోసియేషన్ నేతలు

ప్రజాశక్తి -గాజువాక : వార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేస్తున్నట్లు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం జివిఎంసి 71వ వార్డు తోకాడ సమైక్య అపార్ట్మెంట్, గ్రీన్ లైఫ్, స్వర్ణ అపార్ట్‌మెంట్‌లను కలుపుతూ రూ.18 లక్షలతో నిర్మించనున్న తారురోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వార్డు పరిధిలో పెండింగ్ సమస్యలతోపాటు, కాలనీల ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తానని హామీనిచ్చారు కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ రాజన రామారావు, తోకాడ సమైక్య అపార్ట్మెంట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎం వెంకటేశ్వరరావు, అసోసియేషన్ నాయకులు శ్రీనివాస్ చౌదరి, సభ్యులు పాల్గొన్నారు. అనంతరం వార్డులోని సమస్యలను వెంకటేశ్వరరావు వివరించగా, వాటి పరిష్కారానికి చర్యలు చేపడతానని హామీనిచ్చారు.

ప్రసాదరావుకు అవార్డు



సునీతా రెడ్డి నుంచి అవార్డు అందుకుంటున్న ప్రసాదరావు

ప్రజాశక్తి -తగరపువలస : హిందీ భాషాభివృద్ధికి చేస్తున్న కృషికి భీమిలి మండలం, తాటితూరు జెడ్‌పి హైస్కూల్ హిందీ ఉపాధ్యాయులు టిఎస్‌వి ప్రసాదరావుకు ఉత్తమ హిందీ ప్రచారకుని అవార్డు లభించింది సోమవారం జెసిఐ వైజాగ్ గ్రీన్ సిటీ స్వచ్ఛంద సంస్థ ఈ అవార్డును అందజేసింది. హిందీ ఉపాధ్యాయునిగా పాతికేళ్లుగా విద్యార్థులకు హిందీ బోధనతోపాటు దక్షిణ భారత హిందీ ప్రచార సభ ద్వారా జరిగే పరీక్షలకు అనేక మంది విద్యార్థులను సంసిద్ధులను చేస్తున్నందుకు గుర్తింపుగాసంస్థ అధ్యక్షులు సునీతా రెడ్డి అవార్డు అందజేసారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ చైర్‌పర్సన్ డి సుష్మ , కార్యదర్శి కె నవ్యత పాల్గొన్నారు.

శక్తి యాప్ వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి తగరపువలస : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం శక్తి యాప్ వినియోగం పై విద్యార్థినులకు పోలీసులు అవగాహన కల్పించారు ఈ సందర్భంగా మహిళా ఎఎస్ఐ సుశీల మాట్లాడుతూ, మహిళలరక్షణ , భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం శక్తి యాప్‌ను అందుబాటులోకి తెచ్చిందని, అత్యవసర పరిస్థితుల్లో మహిళలు యాప్ ఓపెన్ చేసి ఎస్ఓఎస్ ఆప్షన్‌పై క్లిక్ చేస్తే, వీడియో, ఆడియో ఆటోమేటిక్‌గా రికార్డయి పోలీస్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం చేరుతుందని, తద్వారా పోలీసులు అప్రమత్తమై ఆదుకునే అవకాశం ఉంటుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి శ్రీవాణి మాట్లాడుతూ శక్తి యాప్‌లోనే ,సేఫ్ ట్రావెల్ ఆప్షన్‌ను ఎంచుకుంటే ధీమాగా, ధైర్యంగా, సురక్షితంగా గమ్యస్థానానికి చేసుకోవచ్చన్నారు ప్రతి విద్యార్థిని తప్పనిసరిగా ఈ యాప్‌ను ఫోన్లో డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు పోలీస్ సిబ్బంది నాగేశ్వరరావు, బి శివ, కె జగదీష్, ఎ హరిత పాల్గొన్నారు

సమస్యల పరిష్కారంలో అలసత్వం

ప్రజాశక్తి- సీతమ్మధార : ఉద్యోగ, ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తోందని ఎపిటిఎఫ్ గౌరవాధ్యక్షుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీనివాసరావు, టిరామకృష్ణారావు అన్నారు. సోమవారం సీతమ్మధార తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ వేతన సవరణ, కరువు భత్యం మంజూరు,ఇతర సమస్యల పరిష్కారం, ఆర్థిక బకాయిల విడుదల, ఆర్థిక ప్రయోజనాల కల్పనలో ప్రభుత్వ నిర్లక్ష్యం సరికాదన్నారు. అనంతరం తహసిల్దార్ పివివి ప్రసాదరావు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ మండలం అధ్యక్ష కార్యదర్శులు బలిరెడ్డి శ్రీనివాసరావు బికె.దుర్గా కుమారి, మహారాణి పేట మండల అధ్యక్షులు బండారు దేముడుబాబు పాల్గొన్నారు.

బస్సులు నిలుపుదల చేయకపోవడంపై నిరసన



బస్సులను అడ్డుకుని నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని నీళ్లకుండీలు, పద్మనాభంరోడ్డులోని చిన్నయ్యపాలెం, రేగానిగూడెం గ్రామాల వద్ద వారం రోజులుగా ఆర్‌టిసి బస్సులు నిలుపుదల చేయకపోవడంపై స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం పెద్దఎత్తున మహిళలతోపాటు విద్యార్థులు, స్థానికులు రోడ్డెక్కి బస్సులను అడ్డుకున్నారు. ఆర్‌టిసి బస్సులు నిలుపుదల చేయకపోవడంతో పాఠశాలలు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులతోపాటు మహిళలు, ఇతరత్రా అవసరాలకు వెళ్లే వారు ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దూరాన ఉన్న మరోబస్‌స్టాప్ వద్దకు వృద్ధులు, మహిళలతోపాటు అందరూ నడిచి వెళ్లాల్సి వస్తోందనివాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, చిన్నయ్యపాలెం, రేగానిగూడెం కూడళ్లలో బస్సులు నిలుపుదల చేయాలని, లేకుంటే ఆందోళనను తీవ్రం చేసి, ఈ మార్గంలో బస్సుల రాకపోకలకు పూర్తిగా నిలుపుదల చేయక తప్పదని హెచ్చరించారు.

నూతన ఆవిష్కరణలతో దేశాభివృద్ధి

- బార్క్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు
- ముగిసిన విస్టా టెక్ 2K25 జాతీయ ఫెస్ట్



ముఖ్యఅతిథి శ్రీనివాసరావును సత్కరిస్తున్న విజ్ఞాన్ ప్రతినిధులు

ప్రజాశక్తి- ఉక్కునగరం : నేటితరం యువత ఉద్యోగాలకు పరిమితం కాకుండా, పరిశోధనలో ముందుకు సాగి, దేశాభివృద్ధికి తోడ్పడాలని, టెక్నాలజీని వినియోగించి పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి దిశగా కొత్త ఆవిష్కరణలు చేయాలని బార్క్ ప్రాజెక్టు డైరెక్టర్, శాస్త్రవేత్త ఎం.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సోమవారం దువ్వాడలోని విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్‌లో జాతీయ స్థాయి టెక్ ఫెస్ట్ 2025 ముగింపు రోజున ఇంజినీర్స్‌డే సందర్భంగా అబ్దుల్‌కలాం సెంటర్ ఫర్ నేషన్ భవనంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రెండు రోజు టెక్‌ఫెస్ట్‌లో వివిధ విభాగాల్లో పోటీల్లో విజేతలకు రూ.మూడు లక్షల విలువైన బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జె. సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడానికి, కొత్త ఆలోచనలను ప్రోత్సహించడానికి, పరిశ్రమల అవసరాలకు తగిన నైపుణ్యాలను అలవర్చుకోవడానికి విస్టా 2K25 వంటి టెక్నికల్ ఫెస్టివల్స్ దోహదపడతాయన్నారు. రెక్టార్ వి. మధుసూదనరావు మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకాలకే పరిమితం కాకుండా వర్క్‌షాప్‌లు, టెక్‌ఫెస్ట్‌ల్లో చురుగ్గా పాల్గొని, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. ముగింపు కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ క్రాంతికుమార్ గంగు వందనసమర్పణ చేయగా, జాతీయగీతాలాపనతో జాతీయఫెస్ట్ ముగిసింది.

నేడు సన్యాసిరావు, లక్ష్మిల సంస్మరణ సభ



మజ్జి సన్యాసిరావు, లక్ష్మి దంపతులు (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి- ఆనందపురం: మండలంలోని తర్లువాడలో ఈనెల 16న మంగళవారం మజ్జి సన్యాసిరావు, లక్ష్మీ దంపతుల సంస్మరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వారి కుమారులు, జనసేన రూరల్ జిల్లా కార్యదర్శి మజ్జి శ్రీనివాసరావు, నాగరాజు, గోపీనాథ్, కుమార్తె వరలక్ష్మి తెలిపారు. కరోనా సమయంలో సన్యాసిరావు మృతి చెందగా, ఇటీవల ఆయన భార్య లక్ష్మి కన్నుమూశారు.

మండలంలోని దబ్బంద ఎడ్మిన్‌గా నిజాయితీగా పనిచేసి, పలువురిరి మన్ననలు పొందిన మజ్జి సన్యాసిరావు, తర్లువాడ గ్రామాభివృద్ధికి విశేషకృషి చేశారు. 1974లో దబ్బంద కరణం ఉద్యోగంతో ప్రస్థానం ప్రారంభించిన సన్యాసిరావు, అనంతరం మెడికల్ శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా, తరువాత కేడీపేట, పాయకరావుపేట, భీమిలి మండలాల్లో విలేజ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించారు. గ్రామాధికారుల వ్యవస్థ రద్దు తర్వాత డిఎంఒ కార్యాలయంలో ఉద్యోగంలోచేరి, 2008లో రిటైరయ్యారు.తర్వాత తర్లువాడ గ్రామాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషిచేసి, ప్రజల మనసుల్లో మచ్చలేని వ్యక్తిగా, చిరస్మరణీయుడిగా నిలిచిపోయారు. తర్లువాడ గ్రామస్తుల హృదయాల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని నిలుపుకున్న సన్యాసిరావు, వారి సతీమణి సంస్మరణ కార్యక్రమాన్ని గ్రామంలో నిర్వహించనున్నట్లు వారి కుమారుడు, రిటైర్డ్ ఆర్మీ జవాన్, జనసేన నేత మజ్జి శ్రీను తెలిపారు.

వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఎంవి.రావు, కరుణ

ప్రజాశక్తి - ఆరిలోవ : హిందీ దివస్ సందర్భంగా ఆరిలోవ, భారతీ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో విద్యార్థులకు హిందీ, సంస్కృత భాషల్లో వ్యాసరచన పోటీలను నిర్వహించారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు హిందీ ఉపాధ్యాయురాలు కరుణ బహుమతులు అందజేసారు. పాఠశాల అధినేత ఎంవి.రావు మాట్లాడుతూ విద్యార్థుల్లో భాషపై పట్టు, నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే ఇటువంటి పోటీలను నిర్వహించామన్నారు.

భీమునిపట్నం : 73వ హిందీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మూడో వార్డు పిఎస్ఎం హైస్కూల్‌లో సోమవారం పక్షోత్సవాలు లాంఛనంగా ప్రారంభించారు. ఆదర్శ హిందీ ప్రేమీ మండలి గౌరవాధ్యక్షులు గంటా నూకరాజు, వ్యవస్థాపక అధ్యక్షులు కెఎస్ఆర్ కృష్ణారావు పాల్గొన్నారు. 21న జాతీయ సమైక్యత అంశంపై విద్యార్థులకు చిత్ర లేఖన , వ్యాస రచన పోటీలు నిర్వహిస్తామని తెలిపారు

సీతారాం ఏచూరికి ఘననివాళి



నివాళులర్పిస్తున్న బెల్ సిఐటియు నేతలు

ప్రజాశక్తి -గాజువాక : బెల్ సిఐటియు ఆఫీసులో సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సిఐటియు నాయకులు జె కోటేశ్వరరావు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సభకు అధ్యక్షత వహించిన సిఐటియు నేత జిటివి ప్రకాష్ మాట్లాడుతూ, బిహెచ్‌పివిని భెల్‌లో విలీనం చేయడంలో ని, అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్‌ని, ఆర్థిక మంత్రి పి.చిదంబరంని, కలిసి సీతారాం ఏచూరి విశేషకృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో, ఎన్ జగన్నాధరావు, అల్లి అప్పల నారాయణ, సీతన్నాయుడు, అల్లు అప్పారావు, అచ్చన్న నాయుడు, మురలేశ్వరరావు, నారపరెడ్డి, ఆనంద్‌కుమార్, ఎం.రాజేంద్రప్రసాద్, ఎస్.రమణ పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వద్దు



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

ప్రజాశక్తి- సీతమ్మధార : కేంద్ర ప్రభుత్వ అనుమతితో రాష్ట్రంలో నిర్మించి, ప్రభుత్వమే నిర్వహించాల్సిన ప్రభుత్వ వైద్యకళాశాలలకు పిపిపి పద్ధతిలో ప్రయివేటుకు కట్టబెట్టాలన్న కూటమి ప్రభుత్వం చర్యలను ప్రతిఒక్కరూ ఖండించాలని రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. సోమవారం అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ కార్యదర్శి జెవి ప్రభాకర్ ఆధ్వర్యంలో అంబేద్కర్ భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం సోమవారం జరిగింది ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో 17 మెడికల్ కాలేజీలకు కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు పొంది, వాటిలో ఐదింటిని ప్రారంభించి, మరో రెండు కాలేజీలు నిర్మాణాలు పూర్తయినా, ప్రారంభించని పరిస్థితుల్లో మిగిలిన పది కాలేజీలు నిర్మాణాలు నిలిపివేసి,కాలేజీలన్నిటినీ పిపిపి విధానంలో అభివృద్ధి చేయాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయం సరికాదన్నారు. పేదలు, బడుగు, బలహీన వర్గాలకు వైద్యవిద్యను దూరం చేసేలా కూటమి ప్రభుత్వ చర్యలు ఉన్నాయని, వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.జి సత్యనారాయణ, పి రవీంద్ర బాబు, ఈ .జయరాజు ,ఎం పైడిరాజు, శ్రీనివాసరావు, వైటి దాస్, మారుతి శ్రీనివాస్, సిద్ధార్థ రవి పాల్గొన్నారు

అప్పన్న సన్నిధిలో విఎంఆర్‌డిఎ కమిషనర్

ప్రజాశక్తి- వేపగుంట : సింహాద్రి అప్పన్నను సోమవారం విఎంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్ విశ్వనాథన్, తన సతీమణితో కలిసి దర్శించుకున్నారు.ఆలయానికి విచ్చేసిన కమిషనర్ దంపతులకు దేవస్థానం పర్యవేక్షణాధికారి కె .వెంకటేశ్వరరావు స్వాగతం పలికారు.ప్రత్యేక పూజల అనంతరం వేదాశీర్వచనం, స్వామి శేషవస్త్రం ప్రసాదాలు స్వీకరించారు. సీనియర్ సహాయకుడు సూర్యనారాయణ, విఆర్ఒ మణికంఠ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో గోపూజ

వేపగుంట : సింహాద్రి అప్పన్న దేవస్థానానికి చెందిన కృష్ణాపురం గోశాలలో కృష్ణజయంతి సందర్భంగా సోమవారం గోపూజ నిర్వహించారు. ఆలయ ఇఒ వేంద్ర త్రినాథ రావు, పర్యవేక్షణాధికారి జివిఎస్‌కె. ప్రసాద్ ఆధ్వర్యంలో గోవులకు స్నానం చేయించి, పూజలు నిర్వహించారు. గోపూజ ప్రాముఖ్యతను ఆలయ అర్చకులు వివరించారు.

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం

సింహాద్రి అప్పన్న ఆర్జిత సేవల్లో భాగంగా సోమవారం స్వామి నిత్యకల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్ఠింపజేసి, పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో కల్యాణతంతు కమనీయంగా జరిపించారు.

ట్రంప్ భారీ సుంకాలతో ఆక్వా పరిశ్రమ కుదేలు

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరరావు

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : ట్రంప్ భారతదేశంపై విధించిన భారీ సుంకాలు వలన ఆక్వా పరిశ్రమ కుదేలైందని, దీనిపై ఆధారపడిన కార్మికులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కేంద్ర ప్రభుత్వం వారిని ఆదుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకర్రావు డిమాండ్ చేశారు. మండలంలోని తిమ్మాపురంలో జావిహాని స్కూల్లో సోమవారం జరిగిన సిఐటియు సమావేశంలో శంకరరావు మాట్లాడుతూ భారత్ నుండి అమెరికా దిగుమతి చేసుకునే సరుకులపై ట్రంప్ ప్రభుత్వం 50 శాతం పైగా సుంకాలను ఆగస్టు 27 నుండి విధించిందని, ఆక్వాపై ట్రంప్ సుంకాల పెంపు ప్రభావం తీవ్రంగా పడిందని పేర్కొన్నారు. మన రాష్ట్రం నుండి అమెరికాకు ఎగుమతి అయ్యే సరుకుల్లో రొయ్యలు, సముద్ర ఉత్పత్తులు, దుస్తులు అధికంగా ఉన్నాయని తెలిపారు. ఎగుమతులు లేక పరిశ్రమల్లో ఉపాధి దెబ్బతింటుందని, రొయ్యలు పెంచే రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, వారిని ఆదుకోవాలని కోరారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం అమెరికా అడుగులకు మడుగులొత్తి చెప్పిన దానికి తల ఊపుతూ అంగీకరిస్తుందని, ఇది దేశ ప్రయోజనాలకు తీవ్రంగా నష్టం కలిగించే చర్య అని పేర్కొన్నారు. అమెరికా సుంకాల చర్యలకు వ్యతిరేకంగా చైనా, బ్రెజిల్ ధైర్యంగా నిలబడి ప్రశ్నిస్తున్నాయని, మన దేశం కూడా ఎదిరించి నిలబడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎం.రాజేష్, వసంత, రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరరావు



కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్

పశుసంపద, పువ్వులు, కూరగాయల సాగుకు ప్రోత్సాహం అందించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో పశుసంపద, పువ్వులు, కూరగాయలు సాగు రంగాల అభివృద్ధికి ప్రోత్సాహం అందించాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు విజ్ఞప్తి చేశారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ఆమె పాల్గొని జిల్లా అభివృద్ధి నివేదికను తెలియజేసారు. ప్రతి ఇంటికీ ఒకటి కంటే ఎక్కువ పశువులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అందుకు ఉత్తమ జాతి జీవాలను ఇతర రాష్ట్రాలనుండి కొనుగోలుకు లబ్ధిదారులకు రుణాలు, సబ్సిడీలను అందించాలని కోరారు. విశాఖనగరం దగ్గరలో ఉన్నందున కూరగాయలు, పువ్వులకు విపరీతమైన డిమాండు ఉందని, వాటి సాగుకు ఉత్సాహవంతులైన రైతులను గుర్తించడం జరిగిందని తెలిపారు. కూరగాయలకు బిందుసేద్యం, పువ్వులు సాగుకు అవసరమైన ప్రోత్సాహకాలు, మౌళిక సదుపాయాలు కల్పించాలని కోరారు.



జెడ్‌పి చైర్‌పర్సన్ నుండి ఉత్తర్వులు అందుకుంటున్న చంద్రశేఖర్

చంద్రశేఖర్‌కు ఎంపిడిఒగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి-కోటవురట్ల : పూర్తి అదనపు బాధ్యతలతో కోటవురట్ల ఎంపిడీవోగా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్‌కు ఎంపీడీవోగా ఉద్యోగోన్నతి లభించింది. ఈ మేరకు సోమవారం జెడ్‌పి చైర్‌పర్సన్ సుభద్ర, సీఈఓ నారాయణమూర్తి చేతుల మీదుగా ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోన్నతి లభించడం ఆనందంగా ఉందని, మండల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

డ్రైనేజీని మెరుగుపరచాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ దరి రెల్లివీధిలో పూడుకుపోయిన డ్రైనేజీని సోమవారం శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పరిశీలించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకుని వారి నుంచి అర్జీలు సేకరించారు. అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్, పెదరెల్లి వీధి వద్ద గల డ్రైనేజ్ వ్యవస్థను పరిశీలించి మెరుగుపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత జీవీఎంసీ జోనల్ కమిషనర్ చక్రవర్తికి, సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు.

నానో యూరియాపై ప్రచారం

ప్రజాశక్తి-ఎలమంచిలి : మున్సిపాలిటీ పరిధిలోని తెరువుపల్లి వార్డులో మండల స్థాయి జీవ ఎరువులు, నానో యూరియా వాడకంపై వ్యవసాయశాఖ సామూహిక ప్రచారం కార్యక్రమం సోమవారం నిర్వహించింది. ఇందులో ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. అనంతరం రైతులకు జీవ, నానో ఎరువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పిఎసిఎస్ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని కలిగొట్ల పిఎసిఎస్ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం సోమవారం జరిగింది. చైర్మన్‌గా దొగ్గ దేముడునాయుడు, డైరెక్టర్లుగా కాసుబాబు, నరసింహనాయుడు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ పివిజి.కుమార్, టిడిపి నాయకులు వై.యేసుదాసు, పోతల పాత్రునాయుడు, పెద్దాడ వెంకటరమణ, రావాడ సింహాద్రి నాయుడు, చల్లా నానాజీ, శరకాన సూర్యనారాయణ, కడిమి నాగేశ్వరరావు, జనసేన నాయకులు గొర్లెపోటు రాములుర్తి నాయుడు పాల్గొన్నారు.



త్రిసభ్య కమిటీ చైర్మన్‌ను సత్కరిస్తున్న కుమార్ తదితరులు

పేదరికాన్ని ఛేదించి.. విజయం సాధించి..

ప్రజాశక్తి-కె.కోటపాడు : పట్టుదల, క్రమశిక్షణతో చదివితే పేదరికం అడ్డురాదని మండలంలోని గొండుపాలెం గ్రామానికి చెందిన వనము నూకమమత నిరూపించింది. పేద కుటుంబంలో పుట్టిన ఆమె పట్టుదలతో చదివి ఇటీవల ప్రకటించిన మెగా డీఎస్సీ ఓపెన్ క్యాటగిరిలో 83 ర్యాంకు సాధించి అందరి మన్ననలు పొందింది. కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్ర దేముడు మనవరాలు అయినా మమత చిన్నతనం నుండి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొని నేడు గ్రేటర్ విశాఖ పరిధిలోని ఎస్‌జిటి ఉపాధ్యాయురాలిగా చేరింది. తాతయ్య ఎర్ర దేముడు అమ్మమ్మ లక్ష్మి సూచనలు సలహాలు తూచా తప్పకుండా పాటిస్తూ ఈ స్థాయికి చేరుకుంది. మమత తల్లిదండ్రులు గ్రామంలో కూలి పని చేసుకుని జీవనం సాగిస్తూ కుమార్తెను క్రమశిక్షణతో పెంచారు. మమతకు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.



మమత

స్కూల్ అసిస్టెంట్‌గా దివ్య

అచ్యుతాపురం : మండలంలో తిమ్మరాజుపేట గ్రామానికి చెందిన దాడి దివ్య మెగా డిఎస్సిలో ర్యాంకు సాధించి స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం పొందింది. నిరుపేద కుటుంబంలో జన్మించిన దివ్య కష్టపడి చదివి ఉన్నత చదువులకు ఫీజులు కట్టడానికి ట్యూషన్లు చెబుతూ చదువుకుంది. ఆమె స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించడం పట్ల టిడిపి నాయకులు కర్రి ఆదిబాబు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.



దివ్య

శిథిలావస్థలో బిసి వసతి గృహం

భయం భయంగా విద్యార్థులు

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని కొరువాడ బీసీ బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరింది. విద్యార్థులు భయం భయంగా ఇందులో ఉంటున్నారు. విద్యార్థులను వేరొక భవనంలోకి మార్పు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ భవనం 1987లో నిర్మాణం చేశారు. ఎంతోమంది విద్యార్థులు ఈ వసతి గృహంలో ఉండి చదువుకున్నారు. ప్రస్తుతం 70 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. భవనం లోపల స్లాబు పూర్తిగా పెచ్చులు ఊడిపోయి ఇనువ ఊచలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం వరుసగా వర్షాలు కురవడంతో ఈ భవనంలోకి నీరు చేరి ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ భయంతో హడలిపోతున్నారు. వర్షం వస్తే గోడలకు విద్యుత్ సరఫరా అవటంతో ఏ గోడను ముట్టుకున్న కరెంట్ షాక్ కొడుతుంది. ఈ విషయమై గతంలో బీసీ వెల్ఫేర్ అధికారులు సందర్శించి హాస్టల్ వర్షానికి కారుతుందని నిర్ధారించారు. నెలలు గడుస్తున్నా విద్యార్థులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం లేదని విద్యార్థి సంఘం నాయకులు కె రమేష్, బి.రమేష్, ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. విద్యార్థుల పుస్తకాలు బట్టలు తడిసిపోతున్నాయని జిల్లా కలెక్టర్ స్పందించి విద్యార్థులను వేరొక భవనంలోకి తరలించాలని, కొత్తగా భవనం నిర్మించాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు డిమాండ్ చేశారు.



పెచ్చులూడిన గోడను చూపుతున్న విద్యార్థులు

స్నేహితురాలి కుటుంబానికి సహాయం

ప్రజాశక్తి-కశింకోట : మండలంలో నర్సింగబిల్లి హైస్కూల్లో 2005-2006 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు తమ క్లాస్‌మేట్ కృష్ణాపురం గ్రామానికి చెందిన చేవేటి మహేశ్వరి కుటుంబానికి సహాయం అందజేశారు. మహేశ్వరి భర్త ఆరోగ్యం క్షీణించడంతో మహేశ్వరి కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకొని రెండు నెలలు సరిపడా కిరాణా సామాన్లు, ఆర్థికంగా సహాయం సోమవారం మహేశ్వరి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో ఆనాల నూకరాజు, ఎస్‌వి నాగేశ్వరరావు, రాజాన సురేష్, మజ్జి ఈశ్వరరావు, పడాల ధర్మరాజు, నమ్మి గణేష్, శానాపతి నూకునాయుడు, శానాపతి సూరిబాబు, జగదీష్ పాల్గొన్నారు.

పార్కు స్థలాన్ని కాపాడాలని వినతి

ప్రజాశక్తి-సబ్బవరం : పైడివాడ అగ్రహారంలో విఎంఆర్‌డిఏ అర్బన్ హౌసింగ్ మెగా లేఔట్‌లో పార్కు స్థలాన్ని కోరుతూ అసకపల్లి మాజీ ఉపసర్పంచ్ మొల్లి సింహాచల నవనీత్ వర్మ (చిన్నారావు) సోమవారం విఎంఆర్‌డిఎ జాయింట్ కమిషనర్ కె.రమేష్‌కు పిజిఆర్‌ఎస్‌లో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ స్థలాన్ని కొంతమంది వ్యక్తులు దురాక్రమణ చేసి ప్లాట్లుగా విభజించి పెన్సింగ్ వేసి విక్రయించడానికి సిద్ధంగా ఉన్నారని, ఆ పెన్సింగ్ వెంటనే తొలగించి పార్కు స్థలానికి హద్దులు నిర్ణయించి పరిరక్షించాలని కోరారు.

వైద్య సేవలపై టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట పీహెచ్‌సీనిజిల్లా వైద్య ఆరోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ బృందం సోమవారం సందర్శించింది. ఆసుపత్రిలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను బృందం సభ్యులు పరిశీలించారు. రికార్డులలో నమోదు చేసిన వివరాలు ఆధారంగా గర్భిణులు, బాలింతలు, కౌమరదశ బాలికల వద్దకు వెళ్లి, వారికి వైద్య పరీక్షలు చేశారు. రికార్డులు, రిపోర్ట్, ఆన్‌లైన్‌లో రిపోర్ట్ తనిఖీ చేశారు. కార్యక్రమంలో జిల్లా స్టాటిస్టికల్ ఆఫీసర్ ఎ.రామచంద్రరావు, డిపిఒ జగదీష్, డేటా మేనేజర్ జనార్దన్, డాక్టర్ కె.వెంకటకృష్ణ, సిహెచ్ఓ బి.దేముడు, సూపర్వైజర్ మామిడి రామకృష్ణ, కన్నబీ పాల్గొన్నారు.

దేవుడు చెరువును పరిరక్షించాలని వినతి

ప్రజాశక్తి-సబ్బవరం : సబ్బవరం మేజర్ పంచాయతీ పరిధి సర్వే నెంబర్ 365లో గల దేవుడు చెరువులోని ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు తొలగించి ఆ చెరువును పరిరక్షించాలని సబ్బవరం గ్రామస్తులు దెందేటి నరసింగరావు పీజీఆర్ఎస్‌లో సోమవారం స్థానిక తహసీల్దార్ బి.చిన్నికృష్ణకు వినతిపత్రం అందజేశారు. సబ్బవరం గ్రామానికి చెందిన కొల్లి కృష్ణ కుటుంబీకులు దేవుడు చెరువులో అక్రమ నిర్మాణాలు చేశారని పేర్కొన్నారు.

ఎస్‌పిని కలిసిన నాతవరం ఎస్ఐ

ప్రజాశక్తి-అనకాపల్లి : నాతవరం ఎస్ఐగా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన వై.తారకేశ్వరరావు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హాని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఎస్పికి ఎస్‌పి శుభాకాంక్షలు తెలియజేశారు

గురుకులంలో డార్మెటరీ ప్రారంభం

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని తానాం ఎంజెపి బిసిడబ్ల్యు బాలికల గురుకుల పాఠశాలలో ఎన్‌టిపిసి సిఎస్ఆర్ నిధులు రూ.50 లక్షలతో నిర్మించిన డార్మెటరీ హాల్‌ను పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎన్‌టిపిసి హెచ్ఆర్ విభాగానికి చెందిన బీబీ పాత్ర, శివరాం ప్రతాప్‌సింగ్, ప్రకాష్, స్థానిక సర్పంచ్ కన్నూరు దేవి వెంకటరమణ, మాజీ జెడ్పిటిసి సభ్యులు పైల జగన్నాధరావు, కూటమి పార్టీల నాయకులు పంచకర్ల ప్రసాద్‌రావు, బొద్దపు శ్రీనివాసరావు, వియ్యపు చిన్న, వర్రి పరిదేసి నాయుడు, కెవిఎస్ఆర్, సర్పంచ్‌లు, పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



డార్మెటరీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

యూరియా కోసం పడిగాపులు

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : మండలంలో కొరుప్రోలు పిఏసిఎస్ వద్ద రైతులు సోమవారం యూరియా కోసం క్యూ కట్టారు. వరి నాట్లు వేసి నెలరోజులు గడుస్తున్న యూరియా సక్రమంగా పంపిణీ చేయలేదంటూ రైతుల ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా, పొటాష్, డీఏపీలు సొసైటి ద్వారా ఎందుకు అందించలేదంటూ వ్యవసాయ అధికారి సౌజన్యను ప్రశ్నించారు. త్వరలోనే అందరికీ అన్ని ఎరువులు అందించేందుకు చర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారి సౌజన్య తెలిపారు.

వడ్డాది : యూరియా కోసం బుచ్చయ్యపేట మండలం వడ్డాది రైతు సేవా కేంద్రం వద్ద రైతులు సోమవారం పడిగాపులు కాశారు. యూరియా వస్తుందన్న సమాచారంతో రైతులు ముందుగానే రైతు సేవా కేంద్రం వద్ద నిరీక్షించారు. వడ్డాదికి 24 మెట్రిక్ టన్నుల యూరియా తెప్పించినట్లు ఏవో భాస్కరరావు తెలిపారు. గందరగోళం లేకుండా పోలీస్ బందోబస్తు నడుమ రైతులకు యూరియా పంపిణీకి చేపట్టామని టౌన్ టిడిపి అధ్యక్షుడు దొండా నరేష్ తెలిపారు.

ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి పట్టణంలో నానాటికి పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని క్రమబద్ధీకరించి ప్రజలకు రక్షణ, భద్రతలను కల్పించాలని కోరుతూ జివిఎంసి జోనల్ కార్యాలయం వద్ద మహాత్మా గాంధీ విగ్రహం వద్ద సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బల్ల నాగభూషణం ఆధ్వర్యంలో సోమవారం ప్లకార్డులతో నిరసన తెలిపారు. అనంతరం జోనల్ కమిషనర్ కె.చక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు వినకోట నీలేష్ గుప్తా, రమణమూర్తి, పిరాట్ల నరసింహమూర్తి, బుగిడి నూకప్పారావు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌కు 313 అర్జీలు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పి.జి.ఆర్.ఎస్.)కు 313 అర్జీలు అందాయి. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, డిఆర్వో వై.సత్యనారాయణరావు, పిజిఆర్ఎస్ ప్రత్యేక ఉప కలెక్టర్ ఎస్.సుబ్బలక్ష్మి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ శచీ దేవి, ఎక్సైజ్ శాఖ అధికారి వి.సుధీర్, జిల్లా సర్వే, భూ రికార్డుల సహాయ సంచాలకులు గోపాల్ రాజు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో 40 ఫిర్యాదులు

అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా 40 ఫిర్యాదులను స్వీకరించారు. 7 రోజులలోపు విచారణ పూర్తిచేసి, తగిన పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు, ఎస్బై వెంకన్న సిబ్బంది పాల్గొన్నారు.

ఎఎంసి కాలనీలో కమ్యూనిటీ హాలు నిర్మించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక ఏఎంసి కాలనీలో కమ్యూనిటీ హాలు నిర్మించాలని కోరుతూ సోమవారం శాసనసభ్యులు కొణతాల రామకృష్ణకు ఏఎంసీ కాలనీ రెల్లి కులస్తులు వినతిపత్రం అందజేశారు. తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని, వాటిని పరిష్కరించాలని కోరారు. దీనిపై కొణతాల స్పందిస్తూ తక్షణమే ఆ ప్రాంతాన్ని పరిశీలించాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర, జోనల్ కమిషనర్ చక్రవర్తి, నాయకులు బొడ్డపు ప్రసాద్, పిట్ల రాజు, మళ్ళ సూరి బాబు తదితరులు పాల్గొన్నారు.

సదరం సర్టిఫికెట్లు పంపిణీ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : విమ్స్ వైద్యాధికారులు మంజూరు చేసిన సదరం ధ్రువపత్రాలను మండలంలోని కోమల్లపూడి, గున్నెంపూడి, పెదమదిన గ్రామాలలో లబ్ధిదారులకు విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆకుల ఫౌండేషన్ చైర్మన్ ఆకుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-వడ్డాది : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన వడ్డాది ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ చిన్నారావును, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు ఎంపికైన వడ్డాది ఎస్సీ కాలనీ పాఠశాల ఉపాధ్యాయురాలు నిమ్మల రమను వైసిపి నాయకులు దొండ నారాయణమూర్తి చేతులమీదుగా సోమవారం వడ్డాదిలో సన్మానించారు. కార్యక్రమంలో డిసిసిబి మాజీ డైరెక్టర్ కోవెల జనార్ధనరావు, ఎంపిటిసి కోరుకొండ రమణ, పాఠశాల కమిటీ చైర్మన్ వంగలి అప్పారావు, తురాయి మనోహర్ పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



చికిత్స పొందుతున్న వరహాలనాయుడును పరామర్శిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలోని వి.మాడుగుల మండలం ఎం.కృష్ణాపురం గ్రామంలో గొర్రెల పెంపకందారుల కుటుంబానికి చెందిన కోళ్ల వరహాల నాయుడును అదే గ్రామానికి చెందిన సర్వేయర్‌గా పనిచేస్తున్న నీటిపల్లి రాము, ఆయన బంధువులు నీటిపల్లి నాయుడు, నీటిపల్లి రాజారావు ఈ నెల 11న కిరాతకంగా పక్కా పథకంతో కర్రతో చితక్కొట్టి దాడి చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్‌పికి విన్నవించారు. ఈ మేరకు ఉమ్మడి విశాఖ జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ చైర్మన్ గంటా శ్రీరామ్, వైస్ చైర్మన్ సబ్బి శ్రీనివాసరావు, ఎం.కృష్ణా పురం మాజీ సర్పంచ్ మొల్లి అప్పారావు తదితరులు జిల్లా ఎస్‌పిని కలిసి విన్నవించారు. బాధితుడు కోళ్ల వరహాలనాయుడు అనకాపల్లి ఎన్టీఆర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతుండగా, ఆయన్ను సంఘం నాయకులు సోమవారం పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సంఘటన జరిగి ఐదు రోజులైనా స్థానిక పోలీసులు స్పందించలేదని, దీంతో జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశామని చెప్పారు. ఇప్పటికైనా అక్రమంగా దాడి చేసిన నీటిపల్లి రాము ఆయన కుటుంబ సభ్యులపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టి ముగ్గురినీ వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఈ నెల 18న మాడుగుల తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎపి గొర్రెల మేకల పెంపకం దారులు సంఘం జిల్లా కార్యదర్శి గోకాడ దేముడు నాయుడు, మాజీ సర్పంచ్ మొల్లి అప్పారావు, కోళ్ల రాజుబాబు, మొల్లి గణేష్, ముమ్మల రాజు, మొల్లి శివ, మొల్లి శ్రీను, ముమ్మల సోము నాయుడు, పల్లా వెంట అప్పారావు, మొల్లి కిత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ



తుమ్మపాలలో స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తున్న బాబీ తదితరులు

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం పంచాయతీలో సోమవారం స్మార్ట్ రేషన్ కార్డులను స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నేత జి.మల్లునాయుడు, తహశీల్దారు ఎ.రామారావు, సర్పంచ్ బండి నూకాలమ్మ, ఈవో కే శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కె.కోటపాడు : కె.కోటపాడులోని శ్రీరామకృష్ణ ఫంక్షన్ హాల్‌లో సోమవారం రేషన్ స్మార్ట్ కార్డులను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి రెడ్డి జగన్మోహన్, టిడిపి నేతలు వాసిరెడ్డి ఏసుదాసు, పివిజి కుమార్, రొంగలి మహేష్, జూరెడ్డి రాము పాల్గొన్నారు.

అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల గ్రామంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను టిడిపి మండల అధ్యక్షులు, మాజీ సర్పంచ్ కర్రి వెంకట సన్యాసినాయుడు (బాబీ) పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు నడిపల్లి బోసు బాబు, పల్లేల గణేష్, గొంతిని శ్రీనివాసరావు పాల్గొన్నారు. మండలంలోని పాపయ్యపాలెం, పాపయ్య సంతపాలెం, అనకాపల్లి పట్టణం నెయ్యల వీధి, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రెల్లివీధి తదితర ప్రాంతాల్లో స్మార్ట్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పంపిణీ చేశారు. జీవీఎంసీ జోనల్ కమిషనర్ చక్రవర్తి, ఎంపీడీవో ఆశాజ్యోతి, ఇన్‌ఛార్జి తహశీల్దారు శాంతి భూషణ్ పాల్గొన్నారు.

అనకాపల్లి రూరల్ : జివిఎంసి 84వ వార్డు పరిధి కొప్పాక, కొత్తూరు నరసింహారావుపేట, సిరసపల్లి, సాలపువానిపాలెం గ్రామాల్లో స్మార్ట్ కార్డులను లబ్ధిదారులకు ఆ వార్డు కార్పొరేటర్ మాదంశెట్టి చిన్నతల్లి నీలబాబు పంపిణీ చేశారు.

యలమంచిలి : స్థానిక గురప్ప కల్యాణ మండపంలో స్మార్ట్ రైస్ కార్డులను ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కొండలరావు, కూటమి నాయకులు బొద్దపు శ్రీను, కర్రి రూన్సీ పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని జెంటపురెడ్డి తుని పంచాయతీలో స్మార్ట్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పంపిణీ చేశారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని తురకలపూడిలో స్మార్ట్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, తహశీల్దార్ ఎం.లక్ష్మి, కోరుకొండ రవికుమార్ పాల్గొన్నారు.

రావికమతం : మండలంలో తట్టబంద సచివాలయం ఆవరణలో సోమవారం నూతన స్మార్ట్ రేషన్ కార్డులను చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కోమటి శంకరరావు, మైచర్ల నాయుడు, కోట నీలవేణి, సర్పంచ్ గోకువాడ రమణ, ఎంపిటిసి పిల్ల శేషు,తహశీల్దార్ అంబేద్కర్, ఎంపిడివో సీతారామస్వామి పాల్గొన్నారు.



కశింకోట మండలం జె.తునిలో స్మార్ట్ కార్డు అందిస్తున్న కొణతాల

హాసిని మరణంపై సమగ్ర విచారణ చేపట్టాలి : ఐద్వా

ప్రజాశక్తి-అనకాపల్లి : నర్సీపట్నం మండలంలో వేములపూడి బాలికల హాస్టల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న హాసిని మరణంపై సమగ్ర విచారణ చేపట్టి న్యాయం చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.మాణిక్యం, డి.డి.వరలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. హాస్టల్ నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగానే హాసిని మరణించిందని, సకాలంలో వైద్యం అందించినట్లయితే హాసిని మరణించేది కాదని కుటుంబ సభ్యులు చెబుతున్నారని పేర్కొన్నారు. హాసిని కడుపునొప్పి వస్తుందని వార్డెన్‌తో చెప్పినా హాస్పటల్‌కి తీసుకు వెళ్లకుండా నిర్లక్ష్యం చేయడాన్ని వారు ఖండించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా హాస్టల్ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో బహిరంగ విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాకు చెందిన రాష్ట్ర హోంశాఖ మంత్రి అనిత ఈ విషయంపై స్పందించాలని, హాసిని కుటుంబానికి తగిన న్యాయం చేయాలని, పది లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు.



జొన్నపల్లి రాము కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాజు

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి గ్రామంలో ఇటీవల మరణించిన తాటికొండ శ్రీను, జొన్నపల్లి రాము కుటుంబాలను ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు, టిడిపి నాయకులు సోమవారం పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వ పరంగా ఆదుకోవడానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, టిడిపి నాయకులు ఎంవివి సత్యనారాయణ, డొంకిన అప్పలనాయుడు, గోపివాడ కోటేశ్వరరావు, గోన్నాబత్తుల శ్రీనివాసరావు, ముమ్మిన సూర్యనారాయణ, ముమ్మిన నాగరాజు, పెదిరెడ్ల మాణిక్యం, తాటికొండ గణేష్ పాల్గొన్నారు.

బకాయి డిఎ విడుదల చేయాలి

ప్రజాశక్తి-యలమంచిలి : యలమంచిలి మండల, పురపాలక సంఘంలోని వివిధ ఉన్నత పాఠశాలలను సోమవారం ఎపిటిఎఫ్ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర పూర్వకార్యదర్శి వెంకటపతిరాజు, జిల్లా అధ్యక్షులు కెవిఎల్ఎన్. ధర్మారావు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 4 డిఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లిపాటి సత్యనారాయణ, కె.వీరభద్రరావు, నీరజ పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ నియామకం

ప్రజాశక్తి-యలమంచిలి : స్థానిక ఏరియా ఆసుపత్రిలో సోమవారం జరిగిన సమావేశంలో అభివృద్ధి కమిటీ సభ్యులను ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ప్రకటించారు. కమిటీకి ఎమ్మెల్యే విజయకుమార్ చైర్మన్‌గా, ఆసుపత్రి సూరింటెండెంట్ డాక్టర్ నిహారిక కన్వీనర్‌గా, సభ్యులుగా తహశీల్దార్ వరహాలు, ఎంపిడిఒ కొండలరావు, గుర్రాల శేఖర్, గొర్లె రత్నాజీ, పిట్టా దాసుబాబు వ్యవహరిస్తారని కన్వీనర్ తెలిపారు.

ఆటో కార్మికుల ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-పరవాడ : ఫ్రీ బస్ పథకంతో నష్టపోతున్న ఆటో కార్మికులను ఆదుకోవాలని కోరుతూ ఈ నెల 18న జరుగు ఆటో కార్మికుల రాష్ట్ర ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. రాష్ట్ర ధర్నాకు సంబంధించిన గోడ పత్రికను సోమవారం పరవాడలో విడుదల చేశారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పెంచిన ట్యాక్స్, పెనాల్టీలు, ఇన్సూరెన్స్‌లు తగ్గించాలని, రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రూ.30 వేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆటో కార్మిక యూనియన్ నాయకులు బలిరెడ్డి రమేష్, కే.సాయి, పి ముని, వి శ్రీను, వి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

'మన డబ్బులు - మన లెక్కలు' యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని ఇరువాడ పంచాయతీ శివారు గణపతినగర్‌లో మహాగణపతి సమైక్య సంఘం ఆధ్వర్యంలో మన డబ్బులు-మన లెక్కలు యాప్‌పై అవగాహన ర్యాలీ సోమవారం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న డిఆర్‌డిఎ పీడీ కె.శచీదేవి మాట్లాడుతూ మన డబ్బులు మన లెక్కలు యాప్ ద్వారా డ్వాక్రా మహిళలు తమ సంఘం పొదుపులు, అప్పులు, వ్యక్తిగత పొదుపులు, అప్పులు తెలుసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డిపిఎం పి.వెంకటరమణ, వెలుగు ఏపిఎం సిహెచ్ శ్రీనివాసరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు దాసరి సునీత, గ్రామ సంఘం అధ్యక్షులు కోన విజయ పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న డిఆర్‌డిఎ పీడీ శచీదేవి

బల్క్ డ్రగ్ పార్క్‌ను నిలిపేయాలి

-మెడకు ఉరితాడు బిగించి మత్స్యకారుల నిరసన- భారీగా పోలీసుల మోహరింపు



రిలే దీక్షా ప్రాంతంలో మోహరించిన పోలీసులు

ప్రజాశక్తి -నక్కపల్లి: బల్క్ డ్రగ్ పార్క్ నిలుపుదల చేసే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని మత్స్యకారులు ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. నక్కపల్లి మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి రెండవ రోజుకు చేరింది. రిలే దీక్షలకు అనుమతి లేదని పోలీసులు ఆంక్షలు విధించినప్పటికీ, భయాందోళన కు గురి చేసినప్పటికీ, కేసులు పెట్టినప్పటికీ మత్స్యకారులు వెనక్కి తగ్గకుండా, తమ ఆందోళనను కొనసాగించారు. అనుమతి లేదని టెంటు వేయకుండా పోలీసులు అడ్డగించినప్పటికీ, మత్స్యకారులు బైఠాయించి, మెడకు ఉరితాడులు తగిలించుకొని బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటును నిరసిస్తూ పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేస్తే తమ ఉనికికే ప్రమాదం వాటిల్లుతుందని మత్స్యకారులు ఆవేదన వెలిబుచ్చారు. బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ తామంతా శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే, పోలీసు బలగాలు మొహరించి, ఆంక్షలు ఎందుకు విధిస్తున్నారని ప్రశ్నించారు. పోలీసుల తీరును వ్యతిరేకిస్తూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. పాయకరావుపేట నియోజకవర్గం లో నక్కపల్లి మండలంలో తమ గ్రామమైన రాజయ్యపేటలో హెూం మంత్రి అనితకు అత్యధిక ఓట్ల మెజారిటీ ఇవ్వడం జరిగిందని, దీనికి పరిహారంగా, హెూం మంత్రి నమ్మించి మోసం చేసిందని ఆవేదన వెలబుచ్చారు. తామందర్నీ చంపేసి బల్క్ డ్రగ్ పార్క్ పెట్టుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు.సోమవారం 21 మందిపై కేసులు నమోదు చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజును సోమవారం తెల్లవారుజామున గృహ నిర్బంధం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యురాలు గోసల కాసులమ్మ, సిపిఎం నాయకులు ఎం సత్యనారాయణ, ఎం రాజేష్, ఎంపీటీసీ సభ్యులు పిక్కి సత్తియ్య, మత్స్యకారులు ఎరిపిల్లి నాగేశ్వరరావు (నాగేష్), మైలపల్లి మహేష్ బాబు, గోసల సోమేశ్వరరావు, చేపల సోమేశ్, నల్ల, టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి గంగరాజు, టిడిపి నాయకులు పిక్కి కోదండరావు, వాసుపల్లి శివ పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. సిఐ కుమారస్వామి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోలీస్ బలగాలను మొహరించారు.

అక్రమ నిర్బంధాన్ని ఖండించండి : సిపిఎం

అనకాపల్లి : రాజయ్యపేట గ్రామంలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు వ్యతిరేకంగా మత్స్యకారులు శాంతియుతంగా నిర్వహిస్తున్న నిరసనలపై రాష్ట్ర ప్రభుత్వపు దౌర్జన్య వైఖరిని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజును ధర్మవరంలో ఆయన సగృహంలో పోలీసులు గహ నిర్బంధం చేయడం, మత్స్యకారులపై ఆంక్షలు విధించి రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను ప్రయోగించి శాంతియుత పోరాటాన్ని అణచివేయాలనే చూస్తే ప్రజాగ్రహానికి గురికాకతప్పదని హెచ్చరించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బల్క్‌డ్రగ్ పార్కు ప్రమాదకరమని నినదించిన టిడిపి నేడు అధికారంలోకి రాగానే ప్రమాదకరం ఎందుకు కాకుండా పోయిందో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న మత్స్యకారులు, రైతులు, స్థానిక ప్రజలపై కేసులు పెడతామని బెదిరించి బల్క్‌డ్రగ్‌ను నిర్మించాలని చేస్తే భవిష్యత్‌లో జరిగే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి వుంటుందని కోటేశ్వరరావు హెచ్చరించారు.

నిర్బంధాలతో ఉద్యమాలు ఆపలేరు

గృహ నిర్బంధాలు, కేసులతో ఉద్యమాన్ని ఆపలేరని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు అన్నారు. సోమవారం ఉదయం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటు చేయవద్దని మత్స్యకారులు చేస్తున్న పోరాటానికి మద్దతు ఇవ్వడానికి తాను గ్రామం నుండి సోమవారం ఉదయం రాజయ్యపేట బయలుదేరుతుండగా పోలీసులు అడ్డగించి గృహ నిర్బంధం చేయించడం దారుణమన్నారు. నిర్బంధాలకు, కేసులకు భయపడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. రాష్ట్ర హెూం మంత్రి అనిత అధికారంలో ఉంటే ఒకవిధంగా, ప్రతిపక్షంలో ఉంటే ఒకవిధంగా మాట్లాడుతున్నారని విమర్శించారు.



అప్పలరాజు గృహ నిర్బంధం

బైపాస్ రోడ్డు శిథిలం

ప్రజాశక్తి- నర్సీపట్నం : భారీ వాహనాలు నర్సీపట్నం టౌన్‌లోకి రాకుండా జోగునాదునిపాలెం మీదుగా ఏర్పాటు చేసిన బైపాస్ రోడ్డు శిథిలావస్థకు చేరుకుంది, దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డు గుంతల మయం కావడంతో వాహనాలు దెబ్బ తినడమే కాకుండా ప్రమాదాలు సైతం చోటుచేసుకుంటున్నాయి, ప్రధానంగా జోగునాధునిపాలెం వద్ద గల మలుపులో రోడ్డు కోతకు గురైంది. దాదాపు ఐదు సంవత్సరాలుగా ఇదే పరిస్థితి నెలకొంది. ఈ బైపాస్ రోడ్డు మీదుగా తుని, చింతపల్లి, కేడీపేట, గొలుగొండ, అదేవిధంగా అనకాపల్లి, విశాఖపట్నం, కోటవురట్ల, పాయకరావుపేట, చోడవరం వెళ్లే భారీ వాహనాలు ఇటువైపుగా రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. రహదారి పూర్తిగా చిద్రం కావడంతో ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుకుంటున్నారు.



గోతులమయంగా ఉన్న రోడ్డు

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : 4నెలలు దాటిన ప్రతి పశువుకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకా తప్పని సరిగా వేయించాలని జాయింటు కలక్టరు ఎం. జాహ్నవి అన్నారు. కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం గాలికుంటు వ్యాధి నిరోధక టీకా కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికలను ఆమె ఆవిష్కరించారు. ఈనెల 15 నుంచి అక్టోబర్ 15 వరకు నిర్వహించే గాలికుంటు వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాన్ని ప్రతి రైతు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, ఎస్‌డిసి సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని కలిగొట్ల గ్రామంలో సోమవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కె.కోటపాడు సహాయ సంచాలకులు ఇ.దినేష్ కుమార్, పశువైద్యాధికారులు గాయిత్రి దేవి, మంజూష రాణి, ప్రియాంక పాల్గొన్నారు.

పరవాడ : పరవాడ మండలం తానాం గ్రామంలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల గోడ పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి పైల జగన్నాథరావు, సర్పంచ్ కన్నూరు దేవీ వెంకట రమణ, పంచకర్ల ప్రసాద్‌రావు పాల్గొన్నారు.



నర్సీపట్నంలో అవగాహన కల్పిస్తున్న రాంబాబు

చోడవరం : మండలంలోని నర్సాపురం, మైచర్లపాలెం, వెంకన్నపాలెం, దామనపల్లి, కండిపల్లి గ్రామాల్లో సోమవారం పశువులలో గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో చోడవరం వెటర్నరీ ఎడి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని గుల్లేపల్లిలో గాలి కుంటువ్యాధి టీకాలు సోమవారం పశువులకు వేశారు. కార్యక్రమాన్ని ఎంపీపీ బోకం సూర్య కుమారి రాము నాయుడు, సర్పంచ్ బండారు మంగ శ్రీను, జనసేన నాయకులు కెవిన్, గజ్జి నరసింగరావు ప్రారంభించారు. పశుసంవర్ధక శాఖ అధికారి బి.రామ్మోహన్‌రావు, సహాయ సంచాలకులు వి.చిట్టినాయుడు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: మండలంలో మొండికండి గ్రామంలో సోమవారం ఉచిత పశు వైద్య శిబిరం, పాడి రైతుల అవగాహన సదస్సును నిర్వహించారు. స్థానిక సర్పంచ్ అర్జున్, మాజీ మండల టిడిపి ప్రెసిడెంట్ లాలం శ్రీరంగ స్వామి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అసిస్టెంట్ డైరెక్టర్ రాంబాబు మాట్లాడుతూ, పశువుల పోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వేములపూడిలో పశువైద్యాధికారులు నరేష్, సౌజన్య, పుష్ప, ప్రసాద్, నూకేష్‌లు పశువులకు గర్భకోశ వ్యాధి పరీక్షలు చేశారు.

చీడికాడ: పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్లు సర్పంచ్ సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని బయలు పూడి, సింగవరంలో సర్పంచ్ శరగడం సన్యాసినాడు, ఎంపిటీసీ పైల ముత్యాల నాయుడు ల చేతుల మీదుగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు ప్రారంభించారు. పశుసంవర్ధక శాఖ సహాయకులు మోర్తా శ్రీనివాసరావు, గ్రామ టీడీపీ అధ్యక్షులు శరగడం శివ, దాడి నర్సింగరావు పాల్గొన్నారు

పద్మనాభం : పాడిరైతులు తమ పశువులకు విధిగా గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలని వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్ సూచించారు. సోమవారం తునివలస గ్రామంలో మహిళా సంఘాలకు స్త్రీనిధి పథకం కింద రెడ్డిపల్లి స్టేట్ బ్యాంకు ఆధ్వర్యంలో డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో పాడిపశువులకు రుణాలు మంజూరు చేశారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి కె.మహేష్ కుమార్, అనూష పాల్గొన్నారు.



ఆర్‌డిఒతో మాట్లాడుతున్న తల్లి

హాసిని మృతిపై సమగ్ర విచారణ చేయాలి

-ఆర్‌డిఒకు తల్లి నాగమణి వినతి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: వేములపూడి బీసీ గర్ల్స్ వసతి గృహంలో చదువుతున్న 8వ తరగతి విద్యార్థిని హాసిని మరణం పై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మృతురాలి తల్లి రంగాల నాగమణి సోమవారం ప్రజా ఫిర్యాదుల వేదికలో ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తల్లి

మాట్లాడుతూ, హాస్టల్‌లో 11వ తేదీ అర్ధ రాత్రి సమయంలో హాసినికి కడుపు నొప్పి వచ్చిందన్నారు. ఈ విషయంపై హాస్టల్ సిబ్బంది తమకు ఎటువంటి కబురు ఉదయం వరకు చెప్పలేదని తల్లి నాగమణి బోరున విలపించింది. రాత్రి సమయంలోనే విషయం తెలిపితే తమ ప్రయత్నం చేసుకుని కూతురుని కాపాడుకునే వారిమని తల్లి తెలియజేసింది. సకాలంలో వైద్యం అందిస్తే తన కుమార్తె బతికేదని ఆమె విలపించారు. అదే రాత్రి హాస్టల్ లో హాసిని రూమ్ లో పాము వస్తే, బైట వారితో చంపి పడేసారని తన చిన్న కుమార్తె చెప్పింన్నారు.నా కూతురు మరణం పై సమగ్ర విచారణను జరిపించాలని కోరింది. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు గౌరి, ట్రెజరర్ కేవీ సూర్యప్రభ పాల్గొన్నారు.



సత్కరిస్తున్న సిఐ

ఉద్యోగాలు సాధించిన యువతకు సత్కారం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: ప్రభుత్వ ఉద్యోగం అంటేనే కష్టపడి చదవాలి. నర్సీపట్నం పరిసర ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులు పోటీ పరీక్షలకు స్థానిక గ్రంథాలయాన్ని ఆశ్రయిస్తున్నారు. 2024-2025 సంవత్సరంలో చదివి ఉద్యోగం పొందిన యువతకు సోమవారం గ్రంథాలయాధికారిణి దమయంతి ఆధ్వర్యంలో సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టౌన్ సీఐ గోవిందరావు, ఎంఈఓలు సిహెచ్. తలుపులు, నాగేంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు చదివి ఉద్యోగాలు సాధించిన మీరంతా ఎంతో మంది యువతీ యువకులకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఉద్యోగంలో ఇంకా ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఉద్యోగం పొందిన వారు మాట్లాడుతూ, లైబ్రేరియన్ దమయంతి తమకు అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచి ఎంతో సహకరించి తమ విజయానికి కారణమయ్యారన్నారు.

నిరసనకు అనుమతి ఇవ్వాలి

- మాజీ ఎమ్మెల్యే వినతి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: నియోజకవర్గంలో మాకవర పాలెం మండలంలోని గల మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణ పై ఈ నెల 18న పట్టణంలోని అబిద్ సెంటర్ వద్ద గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలియజేసేందుకు అనుమతి కోరుతూ స్థానిక టౌన్ పోలీస్ స్టేషన్లో సిఐ గోవిందరావుకు మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ వినతి పత్రాన్ని అందించారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలో పనులు చేపట్టలేదన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీని ప్రైవేటీకరణ చేయడం అన్యాయమని, సామాన్యులకు అందుబాటులో ఉన్న వైద్యసేవలు దెబ్బతింటాయని ఆయన పేర్కొన్నారు. ప్రజల నిధులతో నిర్మించిన మెడికల్ కాలేజీని ప్రైవేట్ వ్యక్తుల చేతికి అప్పగించరాదని డిమాండ్ చేశారు.



లేఖను ఇస్తున్న గణేష్

గిరిజన గ్రామాలకు గ్యాస్ సరఫరా చేయాలి

సిపిఎం ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి- రావికమతం: ఆదివాసి గిరిజన గ్రామాలలో గ్యాస్ సరఫరా చేసేందుకు నోచుకోకపోవడం పట్ల సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె గోవిందరావు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో చీమలపాడు పంచాయతీ పరిధిలో రాయపాడు పి వి టి జి కొందు గిరిజన గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో గ్యాస్ బండ (సిలిండర్లతో) నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు సదుపాయం కలిగిన సుమారు 10 గిరిజన గ్రామాల ప్రజలు ఉచిత గ్యాస్‌కు నోచుకో లేకపోతున్నారన్నారు. పెదగరు. రాయపాడు, రోచ్చి పనుకు, తాటిపర్తి, గంగవరం, నేరేడు బంధ, జడ్జ్.జోగంపేట, అజయ్యురం, కడగడ్డ, బంగారు బంద, కళ్యాణపులోవ గ్రామాలను కలుపుకొని తారు రోడ్డు సదుపాయం ఉందన్నారు. రోడ్డు సదుపాయం ఉన్నప్పటికీ రావికమతం గ్యాస్ ఏజెన్సీ వ్యాను ఆయా గ్రామాలకు రాకపోవడం చాలా విడ్డూరంగా ఉందన్నారు.రాయపాడు గ్రామం నుండి ప్రతి బుధవారం కొత్తపట్నం గ్రామానికి వస్తున్న గ్యాస్ వ్యాను ఆయా గ్రామాలకు ఎందుకు రావడం లేదని ఆయన ప్రశ్నిస్తున్నారు. దీంతో కొత్తకోటలో ప్రైవేట్ వ్యాపారుల వద్ద వెయ్యి రూపాయలు ఇచ్చి గ్యాస్ కొనుగోలు చేసుకోవలసిన పరిస్థితి నెలకొందన్నారు. బైకుల ద్వారా గ్యాస్ బండ్లను తెచ్చుకోవలసిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఆటో కి మరో 200 రూపాయలు మోత మోయవలసి వస్తుందన్నారు. ఇప్పటికైనా తక్షణమే గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులు స్పందించి గిరిజన గ్రామాలకు గ్యాస్ వ్యాను ద్వారా గ్యాస్ బండలను సరఫరా చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో జిల్లా కలెక్టర్, తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించడం తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన నాయకులు గేమిల వాసు, కే.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.


ఆందోళన చేపడుతున్న గోవిందరావు, మహిళలు

ప్రపంచ న్యాయదినోత్సవం ప్రత్యేకం

శాంతి, సుస్థిరతకు సమ న్యాయం

ప్రజాశక్తి- భీమునిపట్నం : న్యాయ సంరక్షణకు పిలుపిస్తున్న 'లా డే'ను మంగళవారం నిర్వహిస్తున్నారు. అంతర్జాతీయ న్యాయ వ్యవస్థను బలోపేతం చేయడమే దీని లక్ష్యం. ఇది అంతర్జాతీయ నేర విభాగంలో న్యాయాన్ని సైతం ప్రోత్సహిస్తోంది. ప్రస్తుత రోజుల్లో న్యాయ వ్యవస్థ సామాన్యుడికి న్యాయం దక్కేలా పలు చట్టాలను అందుబాటులోకి తెచ్చింది. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసిసి) పనికి మద్దతు ఇవ్వడానికి, గుర్తించడానికి ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారు.

రోమ్ శాసనాన్ని చారిత్రాత్మకంగా స్వీకరించిన రోజుకు గుర్తుగా అంతర్జాతీయ న్యాయ దినోత్సవాన్ని 1998లో నిర్ణయించారు. అయితే శిక్షార్హతకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగించడం, యుద్ధ నేరాలు, మానవత్వానికి వ్యతిరేకంగా జరిగే నేరాలు, మారణహోమంలో బాధితులకు న్యాయం చేయడం వంటి వాటి ప్రాముఖ్యాన్ని ఈరోజు సూచిస్తుంది. న్యాయంపై ప్రజల్లో అవగాహన కల్పించి ఐక్యంగా న్యాయం కోసం పోరాడేలా చేయడం. అలాగే బాధితుల హక్కులను సాధించడం కోసం ఈ రోజును ఎంచుకున్నారు.

ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించేలా ప్రజలను ప్రోత్సహిస్తుంది. అనేక నేరాల నుంచి ప్రజలను రక్షించడంతో పాటు దేశ శాంతి, భద్రత, శ్రేయస్సుకు భంగం కలిగించే వ్యక్తులకు హెచ్చరికగా పనిచేస్తుంది. అంతర్జాతీయ నేరాలకు న్యాయం జరిగేలా చేయడం, అంతర్జాతీయంగా జరిగే క్రిమినల్ జస్టిస్‌కు మద్దతు ఇచ్చేలా ప్రోత్సహించడం వంటివి ముఖ్య ఉద్దేశాలు. 1998 నుంచి సుమారు 139 దేశాలు కోర్టు ఒప్పందాలపై సంతకాలు చేశాయి.

అన్యాయం జరగకూడదన్నదే ఉద్దేశం

సమాజంలో ఏ ఒక్కరికీ అన్యాయం జరగకూడదన్నదే న్యాయస్థానం ముఖ్య ఉద్దేశం. అంతర్జాతీయ క్రిమినల్ జస్టిస్ ఏర్పాటుకు గుర్తింపు చర్యగా ప్రతిఏటా ప్రపంచవ్యాప్తంగా ఈ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నారు. అంతర్జాతీయ న్యాయస్థానాన్ని ప్రోత్సహించడానికి ప్రపంచవ్యాప్తంగా వివిధ కార్యకలాపాలు జరుగుతుంటాయి. ఈ రోజు న్యాయ వ్యవస్థపై ప్రజల్లో అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపడతారు.

నేడు లా డే